తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 191 | సోమవారం 02–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in



# కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ ఛార్జ్‌షీట్

- బీజేపీ ఛార్జ్ షీట్ విడుదల చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- 6 అబద్ధాలు-66 మోసాలు అంటూ బీజేపీ ఛార్‌జ్‌షీట్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

కాంగ్రెస్ ఏడాది పాలనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛార్‌జ్‌షీట్ విడుదల చేశారు. ఆరు అబద్ధాలు 66 మోసాలు అంటూ బీజేపీ ఛార్‌జ్‌షీట్‌ను విడుదల చేసింది. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని .. హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారు.. హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు చేసుకోవడం ఏంటని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అనేక ప్రాణత్యాగాలతో తెలంగాణ సాధ్యం అయ్యిందన్నారు. తెలంగాణ ప్రజలు ఏ ఆశయాల కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారో.. ఆ ఆశయాలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు. కుటుంబ పాలన.. అహంకార పూరితంగా కేసీఆర్ పాలన కొనసాగిందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పరిపాలన కూడా కొనసాగుతోందని విమర్శించారు. అబద్దాల హామీలను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించిందన్నారు. వంద రోజుల్లో పూర్తి చేస్తానని చెప్పిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ విఫలమైందన్నారు.
ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తున్నారన్నారు. పదేళ్ళ బీఆర్ఎస్ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలన ఒకే విధంగా ఉందన్నారు. ప్రజల పక్షాన నిలబడాల్సిన బాధ్యత మాపై

మిగతా 2లో



# సంక్రాంతికే రైతుభరోసా

- రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణం
- అన్నదాతల ఖాతాల్లో జమ చేసేగ్యారంటీ నాది
- ఈ అసెంబ్లీ సమావేశాల్లో విధివిధానాలు ఖరారు
- మారీచులు, సుబాహుల మాయమాటలు నమ్మకండి
- సన్నాలకు రూ.500 బోనస్ కొనసాగుతుంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

సంక్రాంతి పండుగ తర్వాత అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా సొమ్ము జమచేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వం రైతుభ రోసాను కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఆనాడు సీతాదే విని ఏమార్చడానికి బంగారులేడీ రూపంలో వచ్చిన మారీచుడే ఇవాళ మారువేషంలో బీఆర్ఎస్, బీజేపీ రూపంలో వస్తాడని హెచ్చరించారు. మారీచులు, సుబాహుల మాయమాటలను రైతులు నమ్మొద్దని సూచించారు. ఇవాళ హైదరాబాద్లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చే నివేదికను ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను అమలు చేసే గ్యారంటీ తనదేనని పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ స్కీమ్ భవిష్యత్లోనూ కొనసాగిస్తామని చెప్పారు. తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ వంగడాలు వేస్తే అధిక దిగుబడి వస్తుందని నిపుణులు చెబుతున్నారని సూచించారు. రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. నిన్నటి పాలమూరు రైతు పండుగ సభకు లక్షలాది మంది రైతులు తరలి వచ్చి ఏడాది కాంగ్రెస్ పాలన, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అభినందించారని వారందరికీ ధన్య వాదాలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో మిగతా 9 ఏళ్లు కూడా అన్ని కార్య క్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగిందన్నారు.రైతులకు రూ.2లక్షల రుణమాఫీ సంపూర్ణంగా పూర్తయిందని సీఎం చెప్పారు. నాలుగు విడతల్లో కలిపి 25,35,964 రైతు కుటుంబాలకు రూ.20,616.89 కోట్ల రుణమాఫీ చేసి గ్యారంటీని అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నాడు. అయినా బీఆర్ఎస్

మిగతా 2లో

# పెద్దపల్లి జిల్లాలో ప్రతి ఎకరానికి సాగు నీరందిస్తాం..

- పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- రికార్డు స్థాయిలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు
- లక్ష మందితో 4న పెద్దపల్లిలో సీఎం సభ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగం పై ఉమ్మడి

మిగతా 2లో



# రాష్ట్ర ఆదాయం పెంచే సత్తా కాంగ్రెస్‌కు లేదు

- హరీశ్‌రావు

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**


సుపరిపాలన అని చెప్పాల్సింది సీఎం కాదు, ప్రజలని తెలంగాణ మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. భారాస ప్రభుత్వం

మిగతా 2లో

# ఐసీసీ చైర్మన్‌గా జైషా

- అత్యంత చిన్న వయసులో ఐసీసీ చైర్మన్ గా జై షా
- జై షా వయసు 35 సంవత్సరాలు
- అన్నీ తానై భారత క్రికెట్ ను నడిపిస్తున్న షా

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ:**



భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి అయినప్పటికీ, భారత క్రికెట్ దశ దిశ అన్నీ తానై నడిపిస్తున్న జై షా... ఇప్పుడు ఐసీసీ పీఠాన్ని అధిష్ఠించారు. ఐసీసీ నూతన చైర్మన్ గా ఆయన ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. జై షా ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.
ప్రస్తుతం జై షా వయసు 35 ఏళ్లు కాగా... ఐసీసీ చైర్మన్ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా ఘనత అందుకున్నారు. అంతేకాదు, ఐసీసీ పీఠం ఎక్కిన ఐదో భారతీయుడు జై షా. ఇప్పటివరకు ఐసీసీలో భారత్ కు ప్రముఖ స్థానం దక్కుతూ వస్తోంది. గతంలో జగ్మోహన్ దాల్మియా (1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసీసీ అధ్యక్షులుగా పనిచేయగా... ఎన్ శ్రీనివాసన్ (2014-15), శశాంక్ మనోహర్ (2015-2020) ఐసీసీ చైర్మన్లుగా వ్యవహరించారు. కేంద్ర హోంమంత్రి

మిగతా 2లో



# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గ్రేటర్ నేతలతో మంత్రి పొన్నం సమావేశం
- ప్రజాపాలన విజయోత్సవాలపై దిశానిర్దేశం
- హాజరైన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

ఏడాదికాలంగారాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదా రాబాద్లో ప్రజాపాలన విజయోత్సవా

మిగతా 2లో

# కేంద్రంపై కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

- ప్రజలను కాపాడాలని అడిగితే తనపై దాడులు చేయిస్తున్నారని ఫైర్
- శనివారం తనపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ అమిత్ షాపై విమర్శలు
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తుపెట్టుకోబోమని వివరణ

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ:**

ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజలను కాపాడాలని అడిగినందుకు కేంద్ర ప్రభుత్వం తనను టార్గెట్ చేసిందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళితే పరిష్కారం చూపిస్తుందని తాను భావించానని కేజ్రీవాల్ చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించి చర్యలు చేపడతారని భావించా కానీ తననే టార్గెట్ చేస్తారని, ఇలా దాడులు చేపిస్తారని అనుకోలేదని మండిపడ్డారు. శనివారం సాయంత్రం మాలవీయ నగర్ లో పాదయాత్ర చేసిన కేజ్రీవాల్ పై ఓ వ్యక్తి దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే.చేతిలోని లిక్విడ్ ను కేజ్రీవాల్ పైకి విసిరాడు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం పోలీసులు ఆ వ్యక్తిని విచారిస్తున్నారు. తాజాగా ఈ ఘటనను ప్రస్తావిస్తూ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాగా, వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో



కాంగ్రెస్ తో కానీ కూటమిలోని ఇతర పార్టీలతో కానీ ఆప్ కలిసి పోటీ చేసే అవకాశం ఉందా అని మీడియా ప్రశ్నించగా... అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని, ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి

మిగతా 2లో

# ములుగు జిల్లాలో భారీ ఎన్ కౌంటర్..!


## ఏడుగురు మావోయిస్టులు మరణం



**తెలంగాణ ముచ్చట్లు , ములుగు :**

మా వోయిస్టులకు షాక్ తగిలింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం ఏజెన్సీ అడవుల్లో భారీ ఎన్ కౌంటర్ లో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. చల్పాక అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో నర్సంపేట ఏరియా కమాండర్ భద్రుతో పాటు ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో రెండు ఏకే 47 రైఫిల్స్ తో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇదే ములుగు జిల్లాలో వారం రోజుల క్రితం ఇద్దరు ఆదివాసీలను ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. దీంతో గ్రేహౌండ్స్ బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలోనే తాజా ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ హతమైనట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నవంబర్ 22న కూడా ఛత్తీస్‌గఢ్



దండకారణ్యంలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్ లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు.సుక్మా జిల్లాలో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఒడిశా సరిహద్దులు దాటి ఛత్తీస్‌గఢ్‌లోకి మావోయిస్టులు ప్రవేశించినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో భద్రత బలగాలు అక్కడికి వెళ్లాయి. తమను చూసిన మావోయిస్టులు కాల్పులు చేపట్టారని అధికారులు చెప్పారు. రక్షణ కోసం ప్రతిగా కాల్పులు జరిపినట్లు వివరించారు. కాగా దేశంలో క్రమంగా మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుతోంది. అటవీ బాట పట్టే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దేశంలో చత్తీస్ గఢ్, ఒడిశాలో మావోయిస్టుల కదలికలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
సోమవారం 02 –12–2024


# కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ ఛార్జ్‌షీట్

**మొదటి పేజీ తరువాయి**

ఉందన్నారు. అందుకే ప్రజల తరపున బీజేపీ ప్రశ్నించడానికి సిద్ధమైందన్నారు. 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేసి.. 9వ తేదీ మా అమ్మ సోనియా గాంధీ జన్మదినం రోజు రుణమాఫీ అని రేవంత్ అన్నాడన్నారు. ఇప్పటికీ ఏడాది పూర్తి కావస్తున్న ఇంకా పూర్తిగా రైతు రుణమాఫీ కాలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల్లో 500 వందల బోనస్ ఇస్తామన్నారని.. అధికారంలోకి వచ్చాకా కేవలం ధాన్యానికి మాత్రమే అన్నారని విమర్శలు గుప్పించారు. ఆ తరువాత సన్న బియ్యానికి అని మాట మార్చారన్నారు. మ్యానిఫెస్టోలో 10 రకాల పంటలకు 5 వందలు బోనస్ అన్నారని.. ఇప్పటి వరకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.

రైతులు 500 బోనస్ కోసం ఎదురు చూస్తున్నారని.. మూడు లక్షల వడ్డీ పంట రుణాలు అన్నారని.. దానికి అతి గతి లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రతి లీటరు పాలకు 5 రూపాయలు అన్నారు.. ఆ ఊసే లేదన్నారు. ఫార్మా సిటీకి వ్యతిరేకంగా అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ పోరాటం చేసిందని.. ఇప్పుడు బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత




కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. ఇప్పటి వరకు ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేయలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్తీ పాఠశాలలు ఓపెన్ చేస్తామని చెప్పారని.. కానీ ఉన్న స్కూళ్లు మూసుకుపోతున్నాయి తప్పా ఒక్క స్కూల్ కూడా ఓపెన్ చేయలేదన్నారు.నాణ్యమైన ఆహారాన్ని కూడా స్కూళ్ళలో అందించలేకపోతున్నారన్నారు.అందుకే స్కూళ్ళలో ఫుడ్ పాయిజన్ అవుతుందన్నారు. ఢిల్లీ నుంచి వచ్చి 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పారు.. ఇంటర్ నేషనల్ స్కూల్స్ అందిస్తామన్నారు.. ఉన్న స్కూళ్లను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి రాగానే 2 వేల పెన్షన్‌ను రూ.4 వేలు చేస్తా అన్నాడు.. అప్పటి వరకు ఉన్న రూ.2 వేలు కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. గీత కార్మికులకు, బీడీ కార్మికులకు, వితంతువులకు 4 వేలు ఇస్తామన్నారు.. వారి తరపున ఎప్పుడిస్తారని తాము అడుగుతున్నామన్నారు. ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న 12 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఏ ఒక్క హామీలను కూడా అమలు చేయాలని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణ మహిళలకు 2500 రూపాయలు ఇస్తమన్నారని.. ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.27,500 ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఆడపడుచులకు వివాహ కానుకగా లక్ష రూపాయల తో పాటు తులం బంగారం ప్రకటించారన్నారు. ఇలా ఎన్నో హామీలు ప్రకటించి అమలుకు నోచుకోవడం లేని పరిస్థితి ఉందన్నారు. హుజూర్ నగర్‌లో బీజేపీ నీ ఓడించడానికి 10 లక్షల దళిత బంధును ప్రకటించాడు కేసీఆర్.. అందుకు మేమేమీ తక్కువా అని కాంగ్రెస్ 12 లక్షలు ప్రకటించిందన్నారు. కానీ ఇద్దరు దళితులను మోసం చేశారన్నారు. తెలంగాణ పదేళ్ళు అధికారంలో ఉంది ఒక్క రేషన్ కార్డు కూడా కేసీఆర్ ఇవ్వలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రేషన్ కార్డులే ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ వచ్చి కూడా ఏడాది పూర్తి కావస్తుందని.. కాంగ్రెస్ కూడా ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా.. బి.ఆర్.ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తుందన్నారు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "డబుల్ బెడ్రూంల పేరుతో అందని ద్రాక్షలా బి.ఆర్.ఎస్ మోసం చేసింది. అప్పుడు కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్లన్నారు.. కానీ ఉన్న ఇండ్లను కూల్చి వేస్తున్నారు.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో హోం గార్డుల సమస్యలు తీరుస్తామన్నారు.. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తా అన్నారు..



# సంక్రాంతికే రైతుభరోసా

**మొదటి పేజీ తరువాయి**

నాయకులు పదేపదే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 201823 వరకు కేస్‌ఆర్. రైతులకు రుణమాఫీ చేసింది కేవలం రూ.11,909 కోట్లు మాత్రమేనని వెల్లడించారు. రూ.7లక్షల కోట్ల అప్పులతో కేసీఆర్ మాకు ప్రభుత్వాన్ని అప్పగించారని తెలిపారు. కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతి నెలా రూ.6,500 కోట్ల వడ్డీని ప్రభుత్వం కడుతున్నదని వివరించారు. కేస్‌ఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ రకంగా క్షీణించిందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. భారీగా అప్పు ఉన్నా అధైర్యపడకుండా పాలన సాగిస్తున్నామని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్రెడ్డికి తెలంగాణతో ఏం సంబంధం ఉంది, ఈ రాష్ట్రం గురించి మాట్లాడేందుకు ఆయనకు ఏం అర్హత ఉందని సీఎం రేవంత్ ప్రశ్నించారు. గుజరాత్లో మద్యపాన నిషేధం ఉందని చెబుతు. న్నారు. అక్కడ ఏయే బ్రాండ్లు దొరుకుతున్నాయో బస్సు ఏర్పాటు చేస్తా వెళ్లి చూసి వద్దామా? అని సవాల్ విసిరారు. మోడీ ఇచ్చిన మేనిఫెస్టోలు పట్టుకుని కాంగ్రెస్ మంత్రులు వస్తారు.. బీజేపీ నుంచి ఎవరు. వస్తారో రమ్మనండి అని చాలెంజ్ చేశారు. 11 సంవ త్సరాల మోడీ హామీలు, 10 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రత్యేక చర్చ పెట్టుకుందామని పేర్కొన్నారు



# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం: మాలలంటే చిన్న చూపంటూ వివేక్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

మాలలు ఐక్యంగా ఉండి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మాలల సింహగర్జన సభకు ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన మాలలను ఉద్దేశించి వివేక్ ప్రసంగించారు.

మాలలు కదిలితే ఏం జరుగుతుందో మనం చూపిద్దామని వివేక్ అన్నారు. అంబేద్కర్ మాల, మాదిగ అని ఆలోచించలేదని.. దళితులకు రిజర్వేషన్ ఇచ్చారన్నారు. కాకా కాలేజీలో ఎక్కడా మాల, మాదిగ అని తేడా ఉండదన్నారు. కాకా గుడిసెలు ఇచ్చినప్పుడు కూడా మాల, మాదిగ అని మాట్లాడలేదన్నారు వివేక్.

రాజకీయ పార్టీల్లో మాలలంటే చిన్న చూపు ఉందన్నారు. అలాంటి వారికి ఈ సభ చెంప పెట్టని అన్నారు. మనం ఐక్యంగా ఉంటేనే.. మనకు గౌరవం లభిస్తుందని మాలలను ఉద్దేశించి వివేక్ వ్యాఖ్యానించారు. మాలల సింహ గర్జన సభకు ఇంత జనం హాజరవుతారని ఎవరూ ఊహించలేదని సంతోషం వ్యక్తం చేశారు.

కుల వివక్ష చూసే అంబేద్కర్ రాజ్యాంగంలో మనకు రిజర్వేషన్లు కల్పించారని.. కానీ, ఇవాళ ఆ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు వివేక్. ముందు క్రిమిలేయర్ అంటారు.. ఆ తర్వాత రిజర్వేషన్లు ఎత్తివేస్తారన్నారు. మాలలపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాలలు అంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు.గతంలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తే.. ఎన్నో పదవులు ఇస్తామంటూ ఆఫర్లు వచ్చాయని.. వాటన్నింటినీ తృణప్రాయంగా విడిచిపెట్టానని వివేక్ చెప్పారు. మాలల కోసం పోరాటం చేస్తోన్న తనపై ఈడీ దాడులు చేసినా వెనక్కి తగ్గలేదన్నారు.

మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ.. మాలల కోసం తన కుటుంబం ఎంతో కష్టపడిందన్నారు. మాల కులాన్ని కాపాడే బాధ్యత తమపై ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ ఏడాది ఆగస్టు 1న తప్పుడు తీర్పు ఇచ్చిందని.. ఆ తీర్పును వ్యతిరేకించేందుకు మాలలంతా ఇక్కడికి వచ్చారన్నారు వినోద్. తక్కువ సంఖ్యలో ఉన్న మాలలు ఎక్కువ దోచుకుతింటున్నారంటూ విమర్శిస్తున్నారని.. మాలలు ఎవరిదేం దోచుకున్నారని ప్రశ్నించారు.

మాలల సింహగర్జన సభకు ఢిల్లీ నుంచి వచ్చిన పాశ్వాన్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఏపీలోనే కాదు.. ఢిల్లీలో కూడా వర్గీకరణపై చర్చ జరగాలన్నారు. ఢిల్లీ వరకు మాలల పోరాటం చేరితే ప్రధాని మోడీ కుర్చీ కదలాలని పాశ్వాన్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై మాలలు ఉద్యమిస్తారని తేలిపోయిందన్నారు. పార్లమెంటులో మాలల గురించి చర్చ జరగాలన్నారు.

# మరో కీలక అప్‌డేట్ ఇచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరో కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్ నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిలో పేదల కంటే ధనవంతులు, సంపన్నులే ఎక్కువగా కనిపిస్తున్నారని రంగనాథ్ వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆక్రమణదారుల్లో ఉన్నారని వెల్లడించారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎవరిని ఉపేక్షించేదని లేదని రంగనాథ్ తేల్చి చెప్పారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో అర్బన్ బయోడైవర్సిటీ అనే అంశంపై శనివరాం నిర్వహించిన జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్.

ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. లోటస్ పాండ్‌లో ఏకంగా ఓ వ్యక్తి ఎకరం స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే హైడ్రా అడ్డుకుందన్నారు. హైడ్రా చర్యలకు ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు.అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టు తీర్పులు కూడా స్పష్టంగా ఉన్నాయని రంగనాథ్ తెలిపారు. త్వరలోనే హైడ్రాకు పోలీస్ స్టేషన్ రాబోతుందని, హైడ్రాకు వచ్చే ఫిర్యాదులను వెనువెంటనే పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు రంగనాథ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# కేంద్రంపై కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రయత్నం తాము చేయలేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని వివరించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్విండ్ కేజ్రీవాల్ పై శనివారం జరిగిన దాడిని, దీనిపై ఆయన కేంద్రంపై చేసిన ఆరోపణలను బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఖండించారు. కేజ్రీవాల్ కు మాత్రమే ఇలాంటి ఘటనలు జరుగుతాయి ఎందుకని అంటూ ఢిల్లీ వాసులు ఆశ్చర్యానికి గురవుతున్నారని ఎద్దేవా చేశారు. మాలవీయ నగర్ లో కేజ్రీవాల్ పై జరిగిన లిక్విడ్ దాడి ఆప్ చేసిన స్టంట్ అని, ప్రజల్లో సింపతీ పొందేందుకు ఆ పార్టీ స్వయంగా ఈ ప్లాన్ చేసిందని సచ్ దేవ ఆరోపించారు. కేజ్రీవాల్ పై పోసింది నీళ్లే తప్ప ఆప్ నేతలు ఆరోపిస్తున్నట్లు స్పిరిట్ కాదని




వివరించారు. ఈ విషయంపై పోలీసులు స్పష్టత ఇచ్చారని సచ్ దేవ గుర్తుచేశారు.

# రాష్ట్ర ఆదాయం పెంచే సత్తా కాంగ్రెస్‌కు లేదు

**మొదటి పేజీ తరువాయి**

మంచి ఆర్థికవృద్ధితో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించిందని, కానీ ఇప్పటి ప్రభుత్వానికి ఆదాయం పెంచే సత్తా లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేసే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. ''రూ.7లక్షల కోట్ల అప్పు అని కాంగ్రెస్ నేతలు ఏడాదికాలంగా చెబుతు న్నారు. ప్రభుత్వ అప్పులన్నీ బహిరంగ రహస్యమే. ఏటా అసెంబ్లీలో కాగ్ ప్రవేశపెట్టే నివేదికల్లో ఉంటాయి. నాడు సీఎల్పీగా ఉన్న భట్టి విక్రమార్కకు రాష్ట్ర అప్పుల గురించి తెలియదా? గత ఎన్నికలకు ముందే రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమయ్యాం. కానీ, కాంగ్రెస్ అడ్డుకుంది'' అని హరీశ్‌రావు అన్నారు. సంపూర్ణ రుణమాఫీతోపాటు వరంగల్ డిక్లరేషన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మొదటి పేజీ తరువాయి**

లపై ఇవాళ ఆయన జీహెచ్ఎంసీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. హైదరా బాద్ మినిస్టర్ క్వార్టర్స్లో జరిగిన కార్య క్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్చార్జి దీపాదాస్ మున్షి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు ఇతర గ్రేటర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రైసింగ్ హైదరాబాద్ పేరుతో ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి హైదరాబాద్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు, శంకు స్థాపనలు చేయనుండడంతో ప్రజల్లో వాటిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.



# ఐసీసీ చైర్మన్‌గా జైషా

**మొదటి పేజీ తరువాయి**

అమిత్ షా తనయుడైన జై షా... 2009లో క్రికెట్ పాలనా వ్యవహారాల్లో తన ప్రస్థానం ప్రారంభించారు. గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన షా... అహ్మదాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. 2019లో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగానూ, ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ చైర్మన్ గానూ వ్యవహరించారు. కాగా, 2020 నవంబరు నుంచి ఐసీసీ చైర్మన్ గా గ్రెగ్ బార్ క్లే వ్యవహరించారు. ఇప్పుడు బార్ క్లే స్థానంలో జై షా ఐసీసీ పగ్గాలు అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యున్నత పదవిని చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని జై షా తెలిపారు. తనకు మద్దతిచ్చిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు, సభ్య



దేశాల క్రికెట్ బోర్డులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.

# పెద్దపల్లి జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీరందిస్తాం..

**మొదటి పేజీ తరువాయి**

కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులు, కాళేశ్వరం ప్యాకేజ్ 9 పెండింగ్, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజ్ 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాల పై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారన్నారు. గతంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులకు ఎక్కడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందన్నారు. డిసెంబర్ 4న సీఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 100 శాతం ధాన్యం డబ్బులు చెల్లించి ఉండాలని ఆదేశించారు. సన్న రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ 2800 కంటే తక్కువ ధరతో సన్న రకం



ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలన్నారు. రాబోయే సంవత్సరంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా కనీసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర గడిచిన నేపథ్యంలో డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తమ ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.



# కువైట్ ఎయిర్‌పోర్ట్‌లో 13 గంటలుగా భారతీయుల పడిగాపులు..

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ:**

ముంబై నుంచి మాంచెస్టర్‌కు బయల్దేరిన విమానం కువైట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ కావడంతో భారతీయ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 13 గంటలకుపైగా కువైట్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. దాదాపు 60 మందికిపైగా భారత ప్రయాణికులు విమానాశ్రయంలోనే గంటలుగా పడిగాపులు కాస్తున్నారు.

అయితే, వారికి సరైన ఆహారం కూడా అందించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తమకు సహాయం అందించేవారే లేరంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం అమెరికా, యూకే పాస్‌పోర్టులు కలిగినవారికి మాత్రమే సదుపాయాలు అందించడంతో తాము తీవ్ర అవస్థలు పడుతున్నట్లు భారత ప్రయాణికులు వాపోతున్నారు.

తమను పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన కొందరు ప్రయాణికులు కువైట్ ఎయిర్‌పోర్టులో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎయిర్ లైన్స్ సిబ్బంది తమను వేధించారని.. అమెరికా, యూకే నుంచి వచ్చిన వారికి మాత్రమే ఎయిర్‌లైన్స్ వసతి కల్పించినట్లు పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.ముంబై నుంచి బయల్దేరిన విమానం బహ్రెయిన్ మీదుగా మాంచెస్టర్ వెళ్లాల్సి ఉండగా.. అకస్మాత్తుగా ప్రతి ఒక్కరూ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు సిద్ధం కావాలని ఎయిర్ లైన్ సిబ్బంది చెప్పారని ఓ ప్రయాణికుడు తెలిపారు. ఇంజిన్‌లో మంటలు, పొగలు వచ్చినట్లు తాను చూశానని మరో ప్రయాణికుడు వెల్లడించారు. విమానం ఎమర్జెన్సీ ల్యాండైన తర్వాత తమకు కూర్చోవడానికి కూడా స్థలం ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో తాము నేలపైనే కూర్చుకున్నామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై గల్ఫ్ ఎయిర్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం.

మరోవైపు, ఎయిర్ పోర్టులో భారతీయులు చిక్కుకున్న విషయంపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాన్ని గల్ఫ్ ఎయిర్ దృష్టికి తీసుకెళ్లింది. ఎంబసీకి చెందిన బృందం ఎయిర్‌లైన్స్‌తో సమన్వయం చేస్తూ ప్రయాణికులకు సహాయం అందించేందుకు విమానాశ్రయం వద్దకు చేరుకుంది. ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుంది.

ఆ తర్వాత ఎయిర్ పోర్టులోని రెండు లాంజ్‌లను వసతి కోసం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. జీసీసీ సమ్మిట్ జరుగుతున్న దృష్ట్యా ఎయిర్ పోర్ట్ హోటల్‌లో వసతి లేదని..వీలుంటే అక్కడే వసతి కల్పిస్తామని పేర్కొంది. కువైట్‌లో దిగిన తర్వాత వీసా పొందే అవకాశం భారత పౌరులకు లేదని.. జీసీసీ సదస్సు కారణంగా అన్ని ప్రభుత్వ కార్యాయాలు కూడా మూసివున్నట్లు అధికారులు వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# స్మగ్లింగ్ డెన్‌గా కాకినాడ బాస్ ఎవరు,తేలిందేంటి..!!

**తెలంగాణ ముచ్చట్లు,ఏపీ :**



ఏపీ రాజకీయాల్లో సీజ్ ది షిప్ కలకలం రేపుతోంది. కాకినాడలో పవన్ పర్యటన..బియ్యం అక్రమ రవాణా పైన చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో సంచలనంగా మారింది. బియ్యం మాఫియా పైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రకటించారు. పవన్ వ్యాఖ్యల పైన వైసీపీ నేతలు స్పందించారు. పవన్ ను అడ్డుకుంటుం దెవరని ప్రశ్నించారు. దీనికి కౌంటర్ గా మంత్రి మనోహర్ కాకినాడ పోర్టుల్లో బియ్యం రవాణా లెక్కలను బయట పెట్టారు. పోర్టుకు సంబంధించి కీలక అంశాలను వెల్లడించారు.పవన్ రాకతోనే కాకినాడ పోర్టు నుంచి బయ్యం ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి వెనుక మాఫియా ఉందని పవన్ ఆరోపించారు. రవాణా చేస్తున్న షిప్ ను సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు మాఫియా ను నియంత్రించటంలో విఫలమవుతున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేసారు. తననే కాకినాడ పోర్టుకు రాకుండా అడ్డుకున్నారని...రవాణా అవుతున్న షిప్ ను చూడనీయటం లేదంటూ ఆసక్తి కర కామెంట్స్ చేసారు. దీని పైన పవన్ ను అడ్డుకుంటుందెవరంటూ వైసీపీ నేతలు ప్రశ్నించారు. మంత్రి మనోహర్ వైసీపీ నేతల వ్యాఖ్యల పైన స్పందించారు. రాష్ట్రంలోని పోర్టుల నుంచి బియ్యం ఏ విధంగా రవాణా అవుతుందో వివరించారు. ప్రజలకు జరుగుతున్నది తెలియచేసేలా పవన్ ప్రయత్నించారని చెప్పుకొచ్చారు. షిప్ వద్దకు తమను వెళ్లనీయలేదని వెల్లడించారు.

పవన్ కళ్యాణ్ పర్యటనలో ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయని, దేశ భద్రతకు భంగం కలిగించేలా అక్కడ స్మగ్లింగ్ జరుగుతుందని మనోహర్ వివరించారు. 51,427 మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడలో తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. 13 కంపెనీలపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. దీంతో వారు కోర్టుకు వెళ్లి బియ్యం విడుదలకు ఆదేశాలు తెచ్చారని.. వారి నుంచి 43.50 కిలోల చొప్పున ధర కట్టి బియ్యం వెనక్కి ఇచ్చామని చెప్పారు. కాగా, అసలు కాకినాడలో అసలు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందనన్నారు. కిలో పది రూపాయల చొప్పున ప్రజల నుంచి రేషన్ బియ్యం కొని స్మగ్లింగ్‌కు పంపుతున్నారని అన్నారు. కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం ఎగుమతి బాగా జరిగిందని చెప్పుకొచ్చారువైసీపీ హయాంలో అరవిందో నుంచి పోర్ట్ లాక్కుని మరీ బియ్యం ఎగుమతి చేశారని ఆరోపించారు. 23,51,218 కృష్ణపట్నం, 38,2000 మెట్రిక్ టన్నులు విశాఖ నుంచి పంపారని.. కాకినాడ పోర్ట్ నుంచి కోటి 30,18, 400 మెట్రిక్ టన్నుల బియ్యం.. అంటే సుమారు 48,537 కోట్ల రూపాయ ల విలువ చేసే బియ్యం ఎగుమతి చేశారని వివరించారు. దీని వెనుక ఎవరున్నారో బయటకు లాగుతున్నామని చెప్పారు. ప్రశ్నించారు. కార్పొరేట్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కెవి రావు కుటుంబాన్ని బెదిరించి 41శాతం వాటా రాయించుకున్నారని, పోర్‌ట్‌ను పూర్తి గా లాక్కున్నారని ఆరోపించారు. కాకినాడను స్మగ్లింగ్ డెన్ గా మార్చింది ఎవరని.. డాన్ ఎవరో తెలియాలని వ్యాఖ్యా నించారు. రాష్ట్రంలో రేషన్ అక్రమాలు అరి కట్టేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.



# హిందూ ధర్మాన్ని కాపాడడమే లక్ష్యం

**తెలంగాణ ముచ్చట్లు,**

హిందూ ధర్మాన్ని కాపాడడం దేశ ధర్మరక్షణ కోసం బజరంగ్‌దళ్ పని చేస్తుందని బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాము లు అన్నారు. ఆదివారం గోదావరిఖని కోదండ రామాల యంలో బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ముష్కె సంపత్ యాదవ్ త్రిశూల్ దీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వ ర్యంలో ధర్మ సంస్థాపన కోసం అహర్నిషలు కృషిచేస్తు న్నారన్నారు. హిందు స్వాభిమానాన్ని కాపాడడం కోసం పనిచేస్తున్నారని, సేవ, సురక్షణ, సంస్కారం నినాదంతో హిందు సమాజానికి సేవ చేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యమని చెప్పారు. లవ్ జీహాది పేరుతో, ల్యాండ్ జీహా ది పేరుతో, వ్యాపార జీహాది పేరుతో హిందువులపై దాడులు జరుగుతున్నాయని, హిందువులపై జరుగుతు న్న దాడులను బజరంగ్‌దళ్ అడ్డుకుంటుందని చెప్పారు. దేశ, ధర్మ రక్షణ కోసం ప్రాణాలను సైతం అర్పించడా నికి సిద్ధంగా ఉన్నామని, దీని కోసం త్రిశూల్ దీక్ష పని చేస్తుందని, దేశ వ్యతిరేక శక్తులను, హిందు వ్యతిరేక శక్తులను బజరంగ్‌దళ్ అడ్డుకుంటుందన్నారు. హిందూ సమాజ హితం కోసం ప్రతి కార్యకర్త త్రిశూల్ ధారి అయి సమాజాన్ని రక్షించే వ్యక్తిగా మారాలన్నారు. యువత మత్తుకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండా లని పిలుపునిచ్చారు. అనంతరం 500మంది కార్యకర్తలు కోదండ రామాలయం నుంచి చౌరస్తా, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, అశోక్‌నగర్ మీదుగా కావతు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి అయోధ్య రవీందర్, స్వరూప్, మల్యాల లక్ష్మణ్, మాధవరపు వెంక ట్రావ్, ఈసంపల్లి వెంకన్న, రవీందర్, మోడెం సురేం దర్, సమ్మన్న, వెంకటస్వామి, సంపత్, అడిగొప్పుల రాజు, అరవింద్, ఆరెపల్లి జలేందర్, శ్రీనివాస్, లింగన్న, రాజేశం, మమత, సూర్యదేవర జ్యోతి, కోట తిరుమల, అన్నపూర్ణ, భవాని పాల్గొన్నారు.

# ఆస్తి కోసం భర్తను 30 ముక్కలుగా నరికిన భార్య..!

**తెలంగాణ ముచ్చట్లు,**



ఓ మహిళ తన భర్తను హత్య చేయడమే కాకుండా అతని శరీరాన్ని 30 భాగాలుగా కోసి 30 ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి వివిధ ప్రాంతాల్లో విసిరేసింది. సిడ్నీలో 53 ఏళ్ల ఆస్ట్రేలియా మహిళ నిర్మిన్ నుఫాల్ అనే మహిళ తన 62 ఏళ్ల భర్త మమ్‌దౌహ్ ఇమాద్ ను హత్య చేసింది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. 2023 మే 3వ తేదీన పశ్చిమ సిడ్నీలోని గ్రీన్‌కర్ హోమ్‌లో భార్య నౌఫల్ తన భర్తను కత్తితో పొడిచి చంపేసింది. ఆ తర్వాత రంపంతో శరీరాన్ని 30 ముక్కలుగా చేసిందని పోలీసులు చెప్పారు. హత్యానంతరం భార్య తన భర్త శరీర భాగాలను 30 ప్లాస్టిక్ సంచులలో ఉంచి, వాటిని వివిధ ప్రదేశాలలో డస్ట్‌బిన్‌లలో పడేసిందని పోలీసులు తెలిపారు.దీని తరువాత భార్య నుఫాల్‌ను మానసిక ఆరోగ్య ఆసుపత్రిలో పరీక్షించిన తర్వాత గత నెలలో అరెస్టు చేశారు. అయితే, ఆమె భర్త మృతదేహం ఇంకా లభ్యం కాలేదు. గతేడాది తమ ఇంట్లోనే నౌఫల్ తన భర్తను ఉద్దేశపూర్వకంగా చంపినట్లు న్యూ సౌత్ వేల్స్ పోలీసులు చెప్పారు. హత్యానంతరం భార్య తన భర్త శరీర భాగాలను 30 ప్లాస్టిక్ సంచులలో ఉంచి, వాటిని వివిధ ప్రదేశాలలో డస్ట్‌బిన్‌లలో పడేసిందని పోలీసులు తెలిపారు.దీని తరువాత భార్య నుఫాల్‌ను మానసిక ఆరోగ్య ఆసుపత్రిలో పరీక్షించిన తర్వాత గత నెలలో అరెస్టు చేశారు. అయితే, ఆమె భర్త మృతదేహం ఇంకా లభ్యం కాలేదు. గతేడాది తమ ఇంట్లోనే నౌఫల్ తన భర్తను ఉద్దేశపూర్వకంగా చంపినట్లు న్యూ సౌత్ వేల్స్ పోలీసులు చెప్పారు. నిర్మీన్ నౌఫల్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు కోర్టు నిరాకరించింది. వ్యక్తిగత కారణాల వల్లే భార్య నుఫాల్ తన భర్తను హత్య చేసిందని ఈ కేసులో లాయర్ చెప్పారు. నుఫాల్ తన భర్తతో సంతోషంగా లేకపోవడం వల్లే ఈ బంధం నుంచి తప్పించుకోవాలనుకుంటుందని లాయర్ చెప్పారు.మే నెలలో ఈజిప్టులో ఆస్తిని సొంతం చేసుకునేందుకు భర్త నుండి భార్యకు చట్టపరమైన అధికారాన్ని ఇచ్చిన తర్వాత ఆమె ఈ దారుణానికి ఒడిగట్టినట్లు లాయర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్తను చంపిన తర్వాత నుఫాల్ ఈజిప్టుకు వెళ్లిపోయింది. అక్కడ ఆమె తన భర్త భూములను రూ. 1 కోటి 70 లక్షల విలువచేసే ఆస్తులను విక్రయించి, ఆపై ఆస్ట్రేలియాకు తిరిగి వచ్చిందని విచారణలో తెలిసింది. ప్రస్తుతం నుఫాల్ మానసిక అనారోగ్యంతో సహా అనేక వ్యాధులను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ అంశంపై తదుపరి విచారణను కోర్టు డిసెంబర్ 11కు వాయిదా వేసింది.



# అలా జరిగితే సమాజం నశించిపోతుంది: ఆర్ఎస్ఎస్ చీఫ్

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ:**

జనాభా తగ్గుదలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో క్షీణత కొనసాగితే సమాజం దానంతట అదే నశించిపోతుందని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. కుటుంబ ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. కుటుంబాలు సమాజంలో భాగమని తెలిపారు.

''జనాభా తగ్గుదల అనేది ఆందోళనకర అంశం. జనాభా శాస్త్రం ప్రకారం సంతానోత్పత్తి రేటు 2.1 కన్నా దిగువకు వెళ్తే.. సమాజం నశించే ప్రమాదం ఉంది. దానిని ఎవరూ అంతం చేయాల్సిన అవసరం లేదు. ఈ సమస్యతో ఇప్పటికే అనేక భాషలు, సంస్కృతులు కనుమరుగయ్యాయి. భారత జనాభా విధానం కూడా ఈ రేటు 2.1 కన్నా తక్కువ ఉండకూడదని చెబుతోంది. మన దేశానికి సంబంధించి ఇది కనీసం మూడుగా ఉండాలి. ఈ సంఖ్య చాలా కీలకం. ఎందుకంటే సమాజ మనుగడకు అది అవసరం'' అని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.1960-2000 మధ్య రెట్టింపైన ప్రపంచ జనాభా పెరుగుదల రేటు ఆ తరవాత నుంచి తగ్గుముఖం పడుతోందని నివేదికలు చెబుతున్నాయి. ప్రతి మహిళ 2.1 మందిని కంటేనే పాతతరాన్ని భర్తీ చేసే స్థాయిలో జననాలు జరుగుతాయి. దీన్ని జనాభా భర్తీ రేటు అంటారు. 2.1కి దరిదాపుల్లో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా ఉన్నాయి. 2.1కన్నా తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, బ్రెజిల్, మెక్సికోలు ఉండగా.. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో అంతకన్నా తక్కువ కనిపిస్తోంది.

# హైదరాబాదులో ఆత్మహత్యకు పాల్పడిన కన్నడ నటి శోభిత

- **గచ్చిబౌలిలోని నివాసంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య**
- **గతేడాది పెళ్లి చేసుకున్న శోభిత**
- **తెలుగులో పలు సీరియళ్లు, సినిమాల్లో నటించిన వైనం**

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**



కన్నడ నటి శోభిత హైదరాబాదులో బలవన్మరణానికి పాల్పడింది. శోభిత గచ్చిబౌలి శ్రీరామ్ నగర్ లోని తన నివాసంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శోభిత తెలుగులోనూ అనేక టీవీ సీరియళ్లలో నటించి గుర్తింపు తెచ్చుకుంది. కన్నడ టాలీవుడ్ లోనూ పలు చిత్రాల్లో నటించిన ఆమె, మరిన్ని అవకాశాల కోసం హైదరాబాదులోనే స్థిరపడింది. ఆమె తెలుగులో నటించిన తొలి చిత్రం ఫస్ట్ డే ఫస్ట్ షో. శోభిత 2023లో వివాహం చేసుకుంది. ఆమె భర్త పేరు సుధీర్. పెళ్లయిన ఏడాదికే ఆమె ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పెళ్లయిన తర్వాత శోభిత సినిమాలకు దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది. శోభిత స్వస్థలం కర్ణాటకలోని హాసన్ జిల్లా సకలేశపుర ప్రాంతం. హైదరాబాదులో పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని బెంగళూరు తరలించనున్నట్టు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమల ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

**తెలంగాణ ముచ్చట్లు,ఏపీ :**



బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుపాను గత రాత్రి తీరం దాటింది. దీని ప్రభావంతో తమిళనాడు, ఏపీ దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలోనూ తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో, తిరుమల రెండో ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం కలగకుండా, టీటీడీ జేసీబీలతో బండరాళ్లను తొలగిస్తోంది.

ఫెయింజల్ తుపాను గత రాత్రి 10.30 గంటల నుంచి 11.30 గంటల మధ్య కారైక్కాల్‌మహాబలిపురం మధ్య తీరాన్ని దాటింది. ప్రస్తుతం ఇది చెన్నైకి దక్షిణ, నైరుతి దిశగా 120 కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉంది.

గడచిన 6 గంటలుగా ఇది పశ్చిమ దిశగా పయనిస్తోందని, క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారిందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు... దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



# ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

**తెలంగాణ ముచ్చట్లు,**

అంతర్జాతీయ వర్తకంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్‌ను దూరంపెట్టే ప్రయత్నాలు చేసే దేశాలు అమెరికాతో వర్తకానికి కూడా దూరం కావాల్సిందేనని హెచ్చరించారు. ఈ మేరకు బ్రిక్స్ దేశాలు ఇండియా, బ్రెజిల్, చైనా, రష్యా, సౌతాఫ్రికాలకు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ లావాదేవీలకు డాలర్ స్థానంలో మరో కరెన్సీ వాడాలని ఇటీవల బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆయా దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. కాగా, అక్టోబర్‌లో రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఈ మేరకు ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

# దోపిడీ కేసులో ఆప్ ఎమ్మెల్యే నరేశ్ అరెస్ట్

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ:**



గతేడాది నమోదైన దోపిడీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే నరేశ్ బల్యాన్‌ను పోలీసులు అరెస్ట చేశారు. ఢిల్లీలోని ఉత్తమ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనను నిన్న విచారణకు పిలిచిన ఆర్కేపురం క్రైంబ్రాంచ్ పోలీసులు అనంతరం అరెస్ట్ చేశారు. దోపిడీలకు పాల్పడుతున్న నరేశ్‌పై ఆప్ చీఫ్ కేజ్రీవాల్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బీజేపీ ప్రశ్నించిన అనంతరం ఈ ఘటన జరగడం గమనార్హం. బల్యాన్ అరెస‌ట్‌ను ఆప్ తీవ్రంగా ఖండించింది. అరెస్ట్ అక్రమమని పేర్కొంది. బీజేపీ ఆరోపణలను ఖండించిన నరేశ్ ఆ పార్టీ తనపై అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వ్యాపారవేత్తల నుంచి డబ్బులు ఎలా రాబట్టాలనే విషయంపై ప్రస్తుతం విదేశాల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ కపిల్ సంగ్వాన్‌తో బల్యాన్ చర్చలు జరిపినట్టుగా చెబుతున్న ఆడియో క్లిప్ ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇప్పుడీ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై దర్యాప్తు కొనసాగుతున్నట్టు పోలీసులు తెలిపారు.

# ఏపీ వక్ఫ్ బోర్డు రద్దు .. ఆదేశాలు జారీ చేసిన సర్కార్

**తెలంగాణ ముచ్చట్లు,ఏపీ :**

ఏపీ వక్ఫ్ బోర్డు విషయంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం నియమించిన వక్ఫ్ బోర్డును రద్దు చేసింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జారీ కాబడిన మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు జీవో 47 ను ఉపసంహరిస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవోను రద్దు చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీవో75 జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్ 21న అప్పటి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం నామినేట్ చేయబడ్డ సభ్యుల నియామకాల తీరుపై కొందరు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. వివిధ రకాల న్యాయపరమైన సమస్యలు తలెత్తిన కారణంగా వక్ఫ్ బోర్డులో పరిపాలన శూన్యత ఏర్పడిందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం జారీ చేసిన, వివాదాస్పదమైన జీవోను రద్దు చేస్తూ నూతనంగా జీవో నెంబర్ 75 ను జారీ చేసిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగానే ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

# కెనడాలో లక్షలాది వీసాలకు ముగియనున్న గడువు!

**తెలంగాణ ముచ్చట్లు :**




కెనడాకు పెరుగుతున్న వలసలను కట్టడి చేసేందుకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కీలక విషయం వెల్లడైంది. వచ్చే ఏడాది చివరి నాటికి లక్షలాది మంది వలసదారుల తాత్కాలిక పర్మిట్‌ల గడువు ముగియనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వీరిలో అనేక మంది స్వచ్ఛందంగా దేశం వీడతారని అంచనా వేస్తున్నామని కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు.సెప్టెంబర్ 2024 డిసెంబర్ 2025 మధ్య కాలంలో దాదాపు 4.9 మిలియన్ల తాత్కాలిక వీసాదారుల గడువు ముగియనుందని కెనడా ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఇదే విషయాన్ని కామన్స్ ఇమిగ్రేషన్ కమిటీ ముందు కన్జర్వేటివ్ ఎంపీ టామ్ మియాక్ ప్రస్తావించారు. దేశం నుంచి వెళ్లిపోయే వారి విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోందని ఆయన ప్రశ్నించారు. ఇందులో 7.66 లక్షల స్టడీ పర్మిట్ల గడువు డిసెంబర్ 2025 నాటికి ముగిసిపోతుందని, వారందరినీ కెనడియన్ బార్డర్ సర్వీసెస్ ఏజెన్సీ ట్రాక్ చేస్తుందా? అని అడిగారు.దీనిపై మంత్రి మిల్లర్ బదులిస్తూ.. దేశాన్ని వీడేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, ఇందులో ఎక్కువ మంది స్వచ్ఛందంగానే వెళ్లిపోతారని అంచనా వేస్తున్నామని చెప్పారు. అయితే, తాత్కాలిక వీసాదారులందరూ దేశాన్ని వీడిపోవాల్సిన అవసరం లేదని, అందులో కొందరు రెన్యూవల్స్ లేదా పోస్టుగ్రాడ్యుయేట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. వాటి గడువు తొమ్మిది నెలల నుంచి మూడేళ్లు ఉంటుందన్నారు. గడువు తీరినా ఇక్కడే ఉండిపోయే వారిపై చట్టపరమైన చర్యలకు సంబంధించిన అంశాన్ని సీబీఎస్ఏ పర్యవేక్షిస్తుందన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# మళ్లీ రైతుల పోరుబాట

- ఈ నెల 6న ఢిల్లీకి పాదయాత్ర
- తక్కిన రాష్ట్రాల్లో అసెంబ్లీకి మార్చ్
- రైతు సంఘాల నాయకుల ప్రకటన
- అన్నదాతల డిమాండ్లను కేంద్రం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

**చంఢీగఢ్, తెలంగాణ ముచ్చట్లు:**

కేంద్రం వైఖరికి నిరసనగా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ డిమాండ్ల విషయంలో మోదీ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు మరోసారి కదం తొక్కడానికి సన్నద్ధమయ్యారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని పంజాబ్‌కు చెందిన రైతు నేత శర్వణ్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు.
దేశంలోని రైతులందరూ వారివారి నేతలు, సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రగా ఢిల్లీకి కదిలి రావాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భద్రతా దళాలు ఫిబ్రవరి 13న నిలిపివేయడంతో వారు పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి ప్రాంతాల్లో నిలిచిపోయారని పంధేర్ ఆదివారం మీడియా సమావేశంలో చెప్పారు. శంభు, ఖనౌరిలలో రైతులు 293 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు.



### పారిపోతున్న కేంద్రం

ఈ ఏడాది ఫిబ్రవరి 18 నుంచి రైతులతో కేంద్రం ఎలాంటి చర్చలు జరపలేదని పంధేర్ తెలిపారు. తమ నుంచి కేంద్రం దూరంగా పారిపోతున్నదని ఆరోపించారు. కాంట్రాక్ట్ వ్యవసాయం తమకెంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను తాము కోరుతున్నామన్నారు. ఐదేండ్ల పాటు ధాన్యం, మక్కజొన్న, పత్తి పంటలకు కనీస మద్దతు ధరతో ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తాయని కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్‌లు తమకు ఇచ్చిన హామీలను అప్పుడే తిరస్కరించినట్టు ఆయన చెప్పారు.

**ఉద్యమ కార్యాచరణ ఇలా..**
రైతుల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరిపై శర్వణ్ సింగ్ మండిపడుతూ శంభు నుంచి దేశ రాజధానికి ర్యాలీ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఉద్యమ కార్యాచరణను వివరించారు. తొలుత రైతులందరూ శంభు వద్ద కలిసి గ్రూప్‌లుగా ఏర్పడాలని, మొదటి గ్రూప్ రైతులకు శత్నాం సింగ్ పన్ను, సురీందర్ సింగ్ చౌతాలా, సుర్జిత్ సింగ్ ఫూల్, బల్జీందర్ సింగ్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ గ్రూప్ తమకు కావాల్సిన నిత్యావసరాలను తీసుకుని ఢిల్లీ వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్లాలన్నారు. రైతులు ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాదయాత్ర కొనసాగిస్తారని, తర్వాత రోడ్డు పక్కన రాత్రుళ్లు గడుపుతారన్నారు. అయితే ఒక్కో గ్రూప్‌లో ఎంతమంది ఉండాలన్న విషయాన్ని తర్వాత తెలియజేస్తామన్నారు. కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులు డిసెంబర్ 6న ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రదర్శన నిర్వహించాలని రైతు నేత గుర్మనీత్ కోరారు. కాగా, ఖనౌరి సరిహద్దులో ఎస్కేఎం నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించారు.

### రైతుల డిమాండ్లివి

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## కాంగ్రెస్ పాలనలో విద్యాసంస్థలు ఆగం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం తనిఖీ

**ఆసిఫాబాద్ టౌన్, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థలు ఆగమయ్యాయని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి ముస్తఫాతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను సందర్శించారు. వంటశాల పరిసరాలతో పాటు భోజనం, కూర, మెనూ ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎకడా ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలు లేవన్నారు. అనంతరం విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు సాయి శ్రావణ్, శ్రీకాంత్, తాజ్, అరుణ్, ప్రవీణ్, రామ్ శేఖర్ పాల్గొన్నారు.



## చెంపదెబ్బలు, పిడిగుద్దులు, చిరిగిన చొక్కాలు.. దారుణంగా కొట్టుకున్న వ్యాపారులు

**లక్నో తెలంగాణ ముచ్చట్లు:**

షాపు బయట వస్తువులు ఉంచడంపై కొందరు వ్యాపారుల మధ్య గొడవ జరిగింది. ఘర్షణ పెరుగడంతో ఇది హింసాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఒకరినొకరు కొట్టుకున్నారు. చొక్కాలు చించుకోవడంతోపాటు చెంపదెబ్బలు, పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఔరైయాలో ఈ సంఘటన జరిగింది. భోలే మందిర్ సమీపంలో ఒక షాపు బయట వస్తువులు ఉంచడంపై అనిల్ కుమార్‌ను పక్కషాపులకు చెందిన పవన్ కుమార్, సన్నీ, లక్కీ నిలదీశారు.కాగా, వారి మధ్య వాగ్వాదం ముదరడంతో ఘర్షణకు దారి తీసింది. దీంతో ఆ వ్యాపారులు ఒకరినొకరు కొట్టుకున్నారు. చెంపదెబ్బలు, పిడిగుద్దులు కురిపించడంతోపాటు చొక్కాలు చించుకున్నారు. రోడ్డుపై దొర్లి ఫైట్ చేసుకున్నారు. స్థానికులు జోక్యం చేసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది.మరోవైపు వ్యాపారి అనిల్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పవన్ కుమార్, సన్నీ, లక్కీపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 2021లో ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్‌లో చిరు వ్యాపారుల మధ్య జరిగిన ఫైట్‌ను ఇది గుర్తు చేసింది.



## చిన్న పట్నంలో పెద్ద చికిత్స

**తెలంగాణ ముచ్చట్లు:**

అది ధైర్యం అనాలో.. నిర్లక్ష్యం అనాలో చెప్పలేం కానీ పల్లె వాసులు సాధారణంగా హాస్పిటల్‌కు వెళ్లడానికి ఇష్టపడరు. జ్వరమైనా, గాయాలైనా, సమస్య కంటిదైనా పంటిదైనా ప్రాణంమీదకు వచ్చాక కానీ చికిత్స కోసం ఆసుపత్రికి కదలరు. తీరా పరిస్థితి విషమించాక వాళ్లు ఇక నేరుగా నగరాల్లోని హాస్పిటళ్లకే రావాల్సి ఉంటుంది. వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాంటి బాధల్నుంచి పల్లెవాసుల్నీ, గిరిపుత్రులను తప్పించాలనుకున్నాయీ సంస్థలు. అత్యాధునికమైన వసతులను వారికి చేరువచేస్తున్నాయి!
**‘గూడెం’లో అత్యాధునిక వైద్యసేవలు :** ‘ఈ హాస్పిటల్ నిర్మాణంలో తొమ్మిది వేలమందికి పైగా గిరిజనులు రాళ్లెత్తారు. చెమటచుక్కను చిందించారు. వారి మొక్కవోని పట్టుదల, ఐకమత్యమే ఈ సంస్థ ఏర్పాటునకు పునాది’ ఆ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఈ వాక్యాలున్న బోర్డు మనల్ని పలకరిస్తుంది! ఇండీజనస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఇడో) హాస్పిటల్ ప్రాంగణం అది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని గట్టుమళ్ల అనే మారుమూల గూడెంలో ఈ ఆసుపత్రి ఉంటుంది. అయితేనేం ఏ ప్రైవేటు హాస్పిటల్ (నర్సింగ్‌హోమ్)కు తీసిపోని అన్ని సౌకర్యాలతో కూడిన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, లేబర్ రూములూ, రోగి సహాయకుల కోసం ప్రత్యేక గదులూ, అల్ట్రాసౌండ్ స్కాన్, ఈసీజీలతో కూడిన అత్యాధునిక ల్యాబూ ఇక్కడ చూడొచ్చు.
**రోజూ వందలాది మంది రోగులకు వైద్యసేవలు :** రోజూ వందమందికి పైగా పేషెంట్లకు సేవలందిస్తోంది. ముఖ్యంగా సురక్షితమైన కాన్పులకు ప్రసిద్ధి చెందింది ఈ హాస్పిటల్. గూడేల్లోని మారుమూల పల్లెల కోసం అంబులెన్స్‌లను సైతం నడుపుతోంది. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచీ పేషెంట్లు వస్తుంటారు. హైదరాబాద్‌కు చెందిన హోమియోపతి డాక్టర్ నరేశ్, గైనకాలజిస్టు డాక్టర్ స్వాతి ఈ ఉచిత హాస్పిటల్ వ్యవస్థాపకులు. సరైన వైద్యం లేక గిరిపుత్రులు పడే పాట్లని చూసి చలించిపోయిన ఈ వైద్య దంపతులిద్దరూ 2017లోనే నగరజీవితాన్ని వదిలి గూడేలకి వచ్చారు. ఫ్రెండ్స్ విరాళాలతో 2021లో ఇడో హాస్పిటల్‌ను స్థాపించారు. ఈ దంపతులని స్ఫూర్తిగా తీసుకుని మరో ఏడుగురు డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందీ సేవలందిస్తున్నారు ఈ హాస్పిటల్‌లో.
**చిన్న పట్నంలో పెద్ద చికిత్స :** 1992 సంవత్సరం నాటి మాట ఇది. చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని భావించింది నిడదవోలు లయన్స్ క్లబ్. ఇందుకోసం శిబిరం ఒకటి ఏర్పాటుచేసి 200 మందికి శస్త్రచికిత్స చేసింది. ఆ రోజుల్లో డాక్టర్లు శుక్లాలు తీసేసిన వెంటనే ఇప్పట్లా కృత్రిమ లెన్స్(ఐఓఎల్) అమర్చేవాళ్లు కాదు. దానికి బదులు లావుపాటి కళ్లద్దాలను ఇచ్చేవారు. ఈ మొత్తం ప్రక్రియకి వారం రోజులు పట్టేది. వారంపాటు ఇలా శిబిరంలోనే ఉండాల్సి రావడం, జీవితాంతం మందపాటి కళ్లద్దాలూ వేసుకోవాల్సి ఉండటమనేది కాయకష్టం చేసుకునే పల్లెవాసుల ఉపాధికి ఇబ్బందిగా మారేది! దాంతో అప్పుడప్పుడే పెద్ద నగరాల్లో పరిచయమవుతున్న ఇంట్రా ఆక్యులర్ లెన్స్(ఐఓఎల్) చికిత్సని చుట్టూ ఉన్న పల్లెప్రజలకీ అందించాలని సంకల్పించారు నాటి లయన్స్ క్లబ్ గవర్నర్ కొత్తపల్లి రామారావు. అందుకోసం ఓ అత్యాధునిక హాస్పిటల్‌ను నిర్మించాలనుకుని ఒకటిన్నర ఎకరం స్థలాన్ని ఇచ్చారు.
**అత్యాధునిక పరికరాలతో :** చాగల్లులోని జైపూర్ షుగర్స్ లిమిటెడ్ అధినేత రాజేశ్వరీ రామకృష్ణన్ రూ.7 లక్షలు ఇవ్వడంతో హాస్పిటల్‌కు ఆమె పేరే పెట్టారు! హైదరాబాద్‌లోని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకి అనుబంధ సంస్థగా దానిని మార్చారు. నాటినుంచి నేటి వరకూ నిడదవోలు చుట్టుపక్కల ఊళ్లలోని ప్రజలకు సేవలందిస్తోంది శ్రీమతి రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ హాస్పిటల్. ఇవ్వగలిగిన వాళ్లదగ్గర నామమాత్రంగా ఫీజు రూపంలో తీసుకుంటారు. ఇవ్వలేని వారికి అంతా ఫ్రీగానే చేస్తారు. ఏటా 12,000 మందికి కంటిచూపు నిస్తున్నారు. కన్నీటి తిత్తులకి(లాక్రిమల్ శాక్స్) ఇన్ఫెక్షన్ వస్తే వాటిని తొలగించే ఆక్యులోప్లాస్టీ సర్జరీ వంటి అరుదైన చికిత్సలనూ చేస్తున్నారు ఇక్కడ. నగరాల్లో కార్పొరేట్ హాస్పిటల్స్‌కే పరిమితమయ్యే ‘లేజర్ కాన్‌స్టలేషన్ విజన్ సిస్టం’ వంటి అత్యాధునిక పరికరాలూ ఇక్కడ ఉన్నాయి. అందుకే, ఈ హాస్పిటల్‌కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌బీహెచ్)గుర్తింపూ దక్కింది!



## బెంబేలెత్తిస్తున్న 'పెద్దపులి' వరుస దాడులతో బిక్కుబిక్కుమంటున్న ప్రజలు

**తెలంగాణ ముచ్చట్లు:**

పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న పులులు మనుషుల ప్రాణాలను హరించి వేస్తుండటంతో ప్రజలు జంకుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న జిల్లా వాసులకు పంట చేలకు వెళితేనే ఉపాధి. ప్రస్తుతం పత్తి ఏరే సమయం కావడంతో కూలీలకు బాగా డిమాండ్ ఉంటుంది. ఎత్తుగా పెరిగిన పత్తి మొక్కల్లో ఏ మూలాన ఏ మృగం ఉందో తెలియదు. అది వచ్చి మాటువేసి పైకి వచ్చి దాడి చేసే దాకా తెలియదు. ఏటా నవంబర్ నుంచి జనవరి వరకు వ్యాఘ్రాలు జత కట్టే సమయం. తోడును వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు పయనిస్తుంటాయి. ఈ సమయంలో పులులు హార్మోన్ల అసమతుల్యం వల్ల గతి తప్పి ప్రవర్తిస్తాయని, అందుకే ప్రజలు వాటి కంట పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. రక్షణ పద్ధతులు పాటించి పులుల దాడుల నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని చెబుతున్నారు.
**అటవీ శాఖ అధికారులు చెబుతున్న రక్షణ పద్ధతులు ఇవే :**
వన్య ప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి వేళల్లో చిన్న గుడారం లేదా టెంట్ వేసుకుంటారు. ప్రస్తుతం ఈ సమయంలో పులుల కదలికలు ఎక్కువగా ఉంటాయి. అందుకు ఇలా ఉండకపోవడమే శ్రేయస్కరం. తప్పనిసరిగా మంచె వేసుకుని, దానిపై ఉంటే ఉత్తమం. పులులు ముఖ్యంగా ఉదయం 6 గంటల సమయంలో, సాయంత్రం 6 గంటల తర్వాత ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ సమయంలో కంటే ముందే చేను నుంచి ఇంటికి వెళ్లిపోవాలి. రైతులు పంట చేలకు వెళ్లే సమయంలో 8 నుంచి 10 మంది గుంపులుగా, చేతిలో తప్పనిసరిగా కర్రను తీసుకెళ్లాలి.
గొర్రెలు, పశువుల కాపరులు జీవాలను మేత కోసం అడవికి తీసుకెళ్తుంటారు. వీరు ఉదయం 10 గంటల తర్వాత అటవీ ప్రాంతానికి చేరుకుని, 4 గంటల్లోపే ఇంటికి చేరుకోవాలి.
**రైతులు తల వెనుక మాస్కులు పెట్టుకున్నారిలా**
చేన్లలో పని చేస్తున్నప్పుడు కాపరులు, రైతులు, తప్పనిసరిగా తల వెనుక భాగంలో మాస్కులు (మనిషి ఆకారంలో ఉండేవి) ధరించాలి.
పత్తి ఏరుతున్న సమయంలో 8 నుంచి 10 మంది ఉండాలి. అందులో ఇద్దరు వ్యక్తులు కాపలా కాయాలి. వీరిద్దరూ ఈలలు, డప్పులు, ఇతర పరికరాలతో చప్పుడు చేస్తుండాలి. అటవీ మార్గాల నుంచి కాకుండా ఇతర దారుల్లో రైతులు తమ చేన్లకు వెళ్లడం మంచిది.
పులి కనిపించినా, అడుగులు ఉన్నా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలి. పులి ఎదురైతే దాని కళ్లల్లో పెట్టి చూస్తూ చేతులు పైకి ఎత్తి వెనక్కి నడవాలి. అస్సలు పరుగెత్తకూడదు. గట్టిగా అరవాలి. వంగి పని చేస్తుంటే జంతువు అనుకుని దాడి చేసే అవకాశం ఉంది.
తనకు హానీ చేస్తారని అనిపించడం, ఆకలి, గందరగోళం సృష్టిస్తేనే పులి దాడి చేసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.



## ఇంట్లో తల్లి, కుమారుడు కాలేజీలో క్లాస్‌మేట్స్!

**తెలంగాణ ముచ్చట్లు:**

ఈ రోజుల్లో చదువుకోవడానికి చిన్నా, పెద్దా అడ్డు రాదు. చదువుకునే వయసులో కొన్ని పరిస్థితుల వల్ల చదువుకోలేక పోతున్నారు. కానీ కుటుంబ ప్రోత్సాహంతో పెళ్లిళ్లు అయ్యి, పిల్లలు పెద్దయ్యాక కూడా చదువుకొని పెద్ద పెద్ద హోదాలో ఉన్నవారు చాలా మంది ఉన్నారు. ఇలాంటి కోవకే చెందుతారు పెద్దపల్లి జిల్లాకు చెందిన తల్లీకుమారుడు.
**తల్లి, కుమారుడు క్లాస్‌మేట్స్ :** పై చిత్రంలో కనిపిస్తున్న తల్లి, కుమారుడు క్లాస్‌మేట్స్. ఉజ్వల భవిష్యత్తు కోసం కుమారుడిని డిప్లొమా కోర్సులో చేర్పించింది ఆ తల్లి. ఆ తర్వాత తానూ ఎందుకు నేర్చుకోకూడదని ఆలోచించారేమో కానీ ప్రవేశం తీసుకుని తనయుడితో కలిసి తరగతులకు హాజరవుతున్నారు. ఈ స్ఫూర్తిదాయకమైన ఉదంతానికి పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామం వేదికైంది.
**ఐటీఐలో చదువుతున్న తల్లీకుమారుడు :** 38 ఏళ్ల జక్కుల స్వర్ణ లతకు ఇంటర్మీడియెట్ చదివే సమయంలో పెళ్లయింది. భర్త లక్ష్మణ్ కూలీ పని చేస్తుంటారు. తన భార్య చదువు ఆగిపోవద్దని ఆమె చదువుకోవడానికి ప్రోత్సహించాడు. దీంతో ఆమె దూర విద్యలో డిగ్రీ, పీజీ చదివారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రోషన్‌ను ఐటీఐలో ఏడాది కాల పరిమితి కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులో చేర్పించాలని నిర్ణయించుకున్నారు.
**ఇద్దరూ కలిసి ఐటీఐలో తరగతులకు :** ఈ కోర్సు అభ్యసించేందుకు వయో పరిమితి 45 సంవత్సరాల వరకు ఉండటంతో సెప్టెంబరులో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్‌లో కుమారుడితో కలిసి ఆమె సైతం ఐటీఐలో చేరి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇద్దరూ కలిసి రోజూ 15 కి.మీ. దూరంలోని పెద్దపల్లి ఐటీఐలో తరగతులకు హాజరవుతున్నారు. ఇంత వయసులో ఎవరికైనా చదువంటే కష్టం కావచ్చు. కానీ ఇష్టమైన పని కష్టంగా అనిపించదని, తాను నేర్చుకోవడంతో పాటు కుమారుడిని ప్రోత్సహించేందుకు ఈ కోర్సులో చేరినట్లు స్వర్ణలత తెలిపారు. ఈ స్ఫూర్తిదాయకమైన తల్లీకుమారులను అక్కడి కాలనీ వాసులు అభినందిస్తున్నారు.

## కేసీఆర్ హయాంలోనే ఎక్కువ మంది రైతులకు లబ్ధి

- కాంగ్రెస్ ప్రభుత్వం కన్నా ఉమ్మడి జిల్లా రైతులకు రూ. వెయ్యి కోట్లు ఎక్కువ రుణమాఫీ
- రేవంత్ సర్కార్ అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి
- హామీలు అమలుచేయకపోతే ప్రజలే అంతుచూస్తారు..
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి




**ఖలీల్‌వాడి, తెలంగాణ ముచ్చట్లు:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కన్నా సీఎం కేసీఆర్ హయాంలో రూ.వెయ్యి కోట్లు ఎక్కువగా రుణమాఫీ చేసినట్లు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. రుణమాఫీ వందశాతం పూర్తయ్యిందని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, దీంతో ఇక్కడి జిల్లా కాంగ్రెస్ నాయకులు రైతులను ఉద్ధరించామని జబ్బలు చరుచుకుంటున్నారని అన్నారు. కల్లబొల్లి మాటలు బంద్ చేసి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏదైనా గ్రామానికి వెళ్లి రుణమాఫీ చేశామని మాట్లాడితే స్థానిక రైతులే వారి సంగతి చూసుకుంటారని అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాలో మొత్తం 3,79,520 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు విడుతల్లో 2,01,967 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని తెలిపారు. ఇంకా 1,78,000 మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో 2016, 2018లో రెండు విడుతల్లో కలిపి కేసీఆర్ ప్రభుత్వం లక్షలోపు రుణమాఫీ కోసం రూ.2,511 కోట్లు ఖర్చు చేస్తే .. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కోసం చేసిన ఖర్చు రూ. 1,517 కోట్లు మాత్రమే అని వివరించారు.
**బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం**
రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకొని నష్టపోయారని తెలిపారు. చాలా మంది రైతులకు ప్రభుత్వం ఇస్తానన్న రూ.500 బోనస్ అందలేదన్నారు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లోని రైతులు ముందుగానే పంట అమ్మేయడంతో వారికి బోనస్ రాలేదన్నారు.
ఎన్నికల సమయంలో అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. జిల్లాలో 12 లక్షల మెట్రిక్ టన్నుల పంటవస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల మెట్రిక్ టన్నుల పంట మాత్రమే కొనుగోలు చేసిందని మండిపడ్డారు. మిగతా పంటను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారని తెలిపారు.
**జిల్లాలోని రైతులందరికీ రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.**
సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ప్రతి రైతుకూ ఎకరానికి ఎగ్గొట్టిన రూ.12 వేల బోనస్, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు కుట్రచేస్తున్నదని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుభరోసా ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రైతుభరోసాను ఇవ్వకపోతే సర్కార్ కూలిపోవడం ఖాయమని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అంతు చూస్తారని హెచ్చరించారు.
**వేగంగా పడిపోతున్న సీఎం రేవంత్ గ్రాఫ్**
అధికారం చేపట్టిన ఏడాదిలోనే దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని సర్వేలు చెబుతున్నాయని వేముల తెలిపారు. ఆడలేక మద్దెల దరువు అనే రీతిలో వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకుని, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాలు ఇచ్చి ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. హామీలు అమలుచేయలేక కేసీఆర్ మీద పడి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరికి రేవంత్‌రెడ్డి పాలన బుడుబుక్కల, బుడ్డర్‌ఖాన్, బుల్డోజర్ పాలనగా మారిందన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక







# 2కె రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని,కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల భాగంగా హనుమకొండ జెఎన్ఎస్ స్టేడియంలో ఆదివారం 2కె రన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య కలిసి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఏడాది ప్రజా పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడం కోసం ఈ విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు తొమ్మిది రోజులపాటు వివిధ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తున్నట్లు వివరించారు. 2కె రన్ ద్వారా క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.డి.ఓ. అశోక్, డి.బ్ల్యూ.ఓ. జయంతి, ఇతర క్రీడాధికారులు, పాల్గొన్నారు.



# మెడికేర్ లో ఇండస్కన్ అంతర్జాతీయ సదస్సు

**వివిధ కాలేజీల నుండి 1000 మంది విద్యార్థుల హాజరు**

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

రోగులకు సరైన చికిత్స అందించటంలో డాక్టర్లు, ఫార్మసిస్టుల పాత్ర ప్రాధానం అని సెంట్రల్ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ కేర్ ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ డి సుధీర్ కుమార్ అన్నారు. ఆదివారం హంటర్ రోడ్డులో గల మెడికేర్ హాస్పిటల్, తాళ్ళ పద్మావతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో చైర్మన్ తాళ్ళ మల్లేశం అధ్యక్షతన ఇండస్కన్ పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులచే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కేర్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఔషద రంగంలో జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని బి ఫార్మసీ, ఫార్మ్ డీ ఉన్నత అవకాశలు లభిస్తాయని అన్నారు. అనంతరం యూనివర్సిటి ఆఫ్ ఫ్రెండ్ లే డాక్టర్ చంద్రశేఖర్, కేయూ ఫార్మసీ కాలేజి డీన్ డాక్టర్ జి.సమ్మయ్య లు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యతను, ఫార్మసి రంగం పై పూర్తి అవగాహనకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చివరగా ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన బైరీ మీడర్, సార అండర్సన్ , డాక్టర్ షాలక సోమయాజి ఫార్మసీ వర్క్ శాపులు మెడిసిన్ దోసేజీల రీసెర్చి గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చివరగా అతిథులకు శాలువా, మేమెంటోలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పిటర్స్ ఛైర్మన్ నారయణ రెడ్డీ, అవినిడా ఇన్నోవేషన్ సీఈవో డాక్టర్ కార్తీక్, మెడికేర్ హాస్పిటల్ డెరైక్టర్ డాక్టర్ చిన్నప్ప రెడ్డి, డాక్టర్ మేఘన, తాళ్ళ పద్మావతి కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు, తాళ్ళ వరుణ్, వైష్ణవి, వివిధ ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్ లు, డాక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించిన సీపీ

**వరంగల్ క్రైమ్,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐలు ఐలయ్య, రాజేందర్, ఎం.డి. వలీ, డేవిడ్, ఏఎస్ఐలు వెంకట కృష్ణా రావు, దామోదర్ చారి, చాంద్ పాషా, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి లను పూలమాలలు వేసి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా, కమిషనర్ మాట్లాడుతూ, పోలీసుల కృషి సమాజానికి ఎనలేని సేవలుగా నిలుస్తుందని, ఈ అధికారులు తమ పదవీకాలంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, సమాజ శాంతి భద్రతల కోసం చేసిన త్యాగాలు రేపటి తరం పోలీసులకు ప్రేరణగా ఉంటాయని చెప్పారు. పదవీ విరమణ చేసిన అధికారులు తమ ఆరోగ్యం కోసం యోగ, వ్యాయామం కొనసాగించడంతో పాటు కుటుంబంతో సమయాన్ని ఆస్వాదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసిపిలు రవి, సురేష్‌కుమార్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐలు సతీష్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

**○ హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థులకు మెనూ ప్రకారం దైనందిన భోజనం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రం లోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య ఆకస్మిక తనిఖీ చేశారు.
వసతి గృహం లోని వివిధ వసతులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు భోజన శాల, తాగునీటి సౌకర్యం, శానిటరీ,, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు విద్యార్థులకు అందిస్తున్న దైనందిక భోజన సౌకర్యాలను విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు సక్రమంగా అందేవిధంగా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేసి మెనూ ప్రకారంగా భోజన సౌకర్యం కల్పిస్తున్న దైనందిక రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. తాగునీటి సౌకర్యం సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన ఫిల్టర్ పాయింటును ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ జిల్లా అధికారిణి శ్రీలత, గిరిజన సంక్షేమ అధికారి ప్రేమలత, వసతి గృహాల సంక్షేమ అధికారి కృష్ణ, హాస్టల్ వార్డెన్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, బట్టల పంపిణీ

**వెంకటాపురం(నూగురు), తెలంగాణ ముచ్చట్లు:**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మల్లాపురం గ్రామంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నుండి వచ్చిన మర్రి లక్ష్మా రెడ్డి కాలేజ్ బీటెక్ విద్యార్థులు సర్వీస్ టు మాన్ కైండ్ సంస్థతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు, ఇతర బట్టలు పంపిణీ చేశారు. 50 మందికి పైగా కుటుంబాలు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందాయి.ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, మాజీ జెడ్పిటిసి పాయం రమణ, అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి కుర్సం లవన్ కుమార్ పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థల విద్యార్థుల సేవలను ప్రశంసిస్తూ, ఏజెన్సీ ప్రాంతానికి అందించిన మద్దతు కోసం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్‌పర్తి మండలం మడిపెల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమం అంచురి విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొని స్వామి వారి పూజలు చేసి భక్తుల మధ్య అనుగ్రహం కోరుకున్నారు.ఈ పూజ కార్యక్రమంలో కాజిపేట దర్గా ప్రాథమిక సహకార సంఘం (పిఏసిఎస్ )అధ్యక్షుడు ఊకంటి వనం రెడ్డి, మల్లారెడ్డిపల్లి ప్రాథమిక సహకార సంఘం (పిఏసిఎస్) అధ్యక్షుడు జక్కు రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ మధు, ఇతర నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



# మండల స్థాయి వ్యాసరచన పోటీలు

**నర్మేట్ట, తెలంగాణ ముచ్చట్లు:**

మండల కేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా జరిగాయిఈ కార్యక్రమం లో భాగంగా మండల స్థాయిలో వ్యాచరచన పోటీలు ఎమ్మార్సీ కేంద్రంలో ఆదివారం రోజున నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులు ప్రథమ బహుమతి సాయి వంశీ మోడల్ స్కూల్ నర్మేట్ట, ద్వితీయ బహుమతి సాత్విక్ సేంట్ ఆన్స్ హై స్కూల్ మరియపురం, తృతీయ బహుమతి హర్షిత జడ్పీహెచ్ఎస్ నర్మేట్ట, కన్సోలేషన్ బహుమతులు మౌనిక వెల్దండ హై స్కూల్, సౌమ్య హన్మంతాపూర్ హై స్కూల్స్ కి వచ్చాయని మండల విద్యాశాఖ అధికారి మడిపల్లి ఐలయ్య తెలిపారు.వ్యాసరచన పోటిల్లో పాల్గొన్న ప్రతి విద్యార్ధికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో సిఆర్పి లు,ఆగయ్య, దయాకర్, రవీందర్,రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్న కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**భీమదేవరపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

భీమదేవరపల్లి మండలంలోని సుప్రసిద్ధ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభం, గుమ్మడికాయతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చరిత్రను వివరించిన వేద అర్చకులు, వీరభద్ర స్వామి ఆవిర్భావం మరియు గుమ్మడికాయలు, కోరమీసాలు సమర్పించే సంప్రదాయంపై ప్రాశస్త్యంగా చెప్పారు. 100 ఏళ్ల నాటి ఈ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే భక్తుల కోరికలు నెరవేరుతాయని విశ్వాసం ఉంది.ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పూజల అనంతరం వేద ఆశీర్వచనం స్వీకరించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.





# 14వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీల ఎన్నిక

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**


వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో బాలాజీ నగర్ లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీ ఏర్పాటు చేశారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు.14వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పస్తం శంకర్‌ను, బాలాజీ నగర్ గ్రామ అధ్యక్షుడిగా కడెం కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, మాజీ సోషల్ మీడియా రాష్ట్ర సమన్వయకర్త అడుప మహేష్ పాల్గొన్నారు. వారిని శాలువాతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు.అన్ని గ్రామాల అధ్యక్షుల నియామకం పూర్తయిందని, నాలుగు రోజుల్లో బీసీ సెల్, సోషల్ మీడియా, యూత్, మైనార్టీ విభాగం, మహిళా కమిటీ ఏర్పాట్లు పూర్తవుతాయని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులను శాలువాతో సన్మానించి ఘనంగా జరుపుకున్నారు.
ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**నర్మెట్ట, తెలంగాణ ముచ్చట్లు:**

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మచ్చుపహాడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు జడల రమేష్ ఆధ్వర్యంలో వేల్పుల రేణుక భర్త రాజయ్య కు రెండు లక్షల 50 వేల రూపాయలు ఎల్ఓసిని రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్ అందజేశారు. వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రేణుక వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా కిరణ్ కుమార్ విషయాన్నీ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి రెండు లక్షల యాభై వేయిల రూపాయలు మంజూరు చేయించారు. కుటుంబ సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కొమురవెల్లి దేవస్థానం అధ్యక్షులు గొల్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీపీ బుక్క జయరాం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బండి అశోక్, కూకట్ల చంద్రమౌళి, ఎస్టీ సెల్ అధ్యక్షులు నూనావత్ రాజకుమార్,నాయకులు దేవ్ సింగ్, మధు గుప్తా, అంజయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు



## ఈ గ్రహంపై ఒక సంవత్సరం అంటే 21 గంటలే!

**తెలంగాణ ముచ్చట్లు:**
సౌర వ్యవస్థలో ఉన్న గ్రహాల్లో నెప్ట్యూన్ కూడా ఒకటి. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా సౌర వ్యవస్థలకు వెలుపల ఒక చిన్న గ్రహాన్ని కనుగొంది. ఇది పరిణామంలో నెప్ట్యూన్ ను పోలి ఉంది. ఈ గ్రహానికి TOI3261 b అని నామకరణం చేశారు. ఇది ఓ నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్నట్టు నాసా గుర్తించింది. అయితే, ఆ నక్షత్రానికి అత్యంత సమీపంగా పరిభ్రమిస్తుండడంతో, ఈ గ్రహంపై ఓ సంవత్సరం అంటే చాలా తక్కువ సమయం ఉంటుంది. ఈ గ్రహంపై ఓ ఏడాది అంటే కేవలం 21 గంటలే. ఇప్పటివరకు ఇలాంటి గ్రహాలు మూడే ఉన్నాయట. ఇది నాలుగో గ్రహం. బృహస్పతి తరహాలోనే ఈ కొత్త గ్రహంపైనా భారీగా వాయువులు నిండి ఉన్నట్టు నాసా పరిశోధనలో వెల్లడైంది.




# ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
49వ డివిజన్ నాగేంద్రనగర్‌కు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు కంది యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ వారిని ఆదివారం గులాబీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్, రాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, "పేదల పక్షాన పోరాడేది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మాత్రమే" అని తెలిపారు. స్థానికంగా మౌలిక వసతులు అందించడంలో బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుందని, రోడ్లు, డ్రైనేజీలు, కరెంట్ కనెక్షన్ల వంటి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. "పేదల గుడిసెల జోలికి వస్తే ఊరుకోబోం. ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్, బీజేపీపై వ్యతిరేకతతో పాటు కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.పార్టీలో చేరిన వారిలో కంది జ్యోతి, గుర్రాల రజిత, శ్యామల, కాంతమ్మ, రాజేష్, చింటు, సునీత, సుగుణ, ప్రవీణ్, సిద్ధు, కిరణ్, ఉమేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.



## నవంబరు మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు

**తెలంగాణ ముచ్చట్లు:**
నవంబరు నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల వివరాలను కేంద్రం నేడు వెల్లడించింది. నవంబరు మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది నవంబరుతో పోల్చితే జీఎస్టీ వసూళ్లలో 8.5 శాతం పెరుగుదల నమోదైనట్టు వివరించింది. 2023 నవంబరులో రూ.1.68 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది.
ఈ ఏడాది నవంబరులో దేశీయ ఆర్థిక లావాదేవీల ద్వారానే అత్యధిక ఆదాయం లభించినట్టు కేంద్రం పేర్కొంది. నవంబరు జీఎస్టీ వసూళ్లలో సీజీఎస్టీ రూ.34,141 కోట్లు కాగా... రాష్ట్రాల జీఎస్టీ రూ.43,047 కోట్లు. అదే సమయంలో ఐజీఎస్టీ రూ.91,828 కోట్లు, సెస్ రూ.13,253 కోట్లు.
భారత్ లో జీఎస్టీ ప్రవేశపెట్టాక ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు అంటే ఈ ఏడాది ఏప్రిల్ లో వసూలైన జీఎస్టీ గురించే చెప్పాలి. 2024 ఏప్రిల్ లో రికార్డు స్థాయిలో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఈ ఏడాది అక్టోబరులో రూ.1.87 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కాగా.... ఇది రెండో అత్యుత్తమ జీఎస్టీ కలెక్షన్ గా ఉంది.



## ఘనంగా బెస్ట్ అవుట్‌గోయింగ్ విద్యార్థుల వేడుక

- అవార్డులు అందుకున్న సెయింట్ ఆంథోనీ పాఠశాల విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన పాఠశాల చైర్మన్

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ రాష్ట్ర 2024 బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థుల వేడుకలో సెయింట్ ఆంథోనీ పాఠశాల విద్యార్థులు పాల్గొని అవార్డులు అందుకున్నారు. ఈ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ ఆనందరావు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో, ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన సెయింట్ ఆంథోనీ పాఠశాల విద్యార్థులు కొండోజు సాయి సాహితి, సింగపురం వరుణ్ "బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్" అవార్డులు అందుకున్నారు. అవార్డులను హవర్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు మునీష్ జిందాల్, ఆల్ ఇండియా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షురాలు జ్యోష్ణ రావు చేతుల మీదుగా విద్యార్థులకు ప్రదానం చేశారు.విద్యార్థుల విజయాన్ని పాఠశాల చైర్మన్ రాజారపు ప్రతాప్, కరస్పాండెంట్ ప్రభుదేవ్ అభినందిస్తూ, వారు పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేల్పుల అశోక్, వైస్ ప్రిన్సిపాల్ చాడ రాధిక రెడ్డి, అడ్మిన్ ఇన్‌చార్జి రేసు మధు, ఇతర పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ అవార్డు వేడుక విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తేవడమే కాకుండా, వారికి మరింత ప్రోత్సాహం కలిగించిందని ఆహూతులు పేర్కొన్నారు.




## పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**ధర్మసాగర్/చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**
ధర్మసాగర్ మండలంలోని,ఎలుకుర్తి గ్రామంలో మాజీ ఎంపీటీసీ నరిశెట్టి సుధాకర్ తండ్రి నరిశెట్టి పెద్ద కొమురయ్య ఇటీవల మరణించగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఎలుకుర్తిలోని సుధాకర్ ఇంటిని సందర్శించి, కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, తన సానుభూతిని తెలిపారు. తదుపరి, మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, డాక్టర్ రాజయ్య వీరాభిమాని వేలూరి కేశవరెడ్డి అత్తమ్మ పూంద్రు సుభద్ర మరణించినందున, డాక్టర్ తాటికొండ రాజయ్య ఆమె ఇంటిని సందర్శించి, సుభద్ర పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

**మహిపాల్ ను పరామర్శించిన డాక్టర్ రాజయ్య**
చిల్పూర్ మండలంలోని రాజవరం గ్రామంలో, డాక్టర్ రాజయ్య వీరాభిమాని, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల మహిపాల్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న డాక్టర్ తాటికొండ రాజయ్య అతని ఇంటికి వెళ్లి మహిపాల్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వైద్య సలహాలు ఇచ్చారు.
ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## హనుమంతుడి ఆలయంలో గదతో వానరం..

**తెలంగాణ ముచ్చట్లు:**
అదొక ఆంజనేయ స్వామి ఆలయం... అక్కడికి ఒక వానరం వచ్చింది. హనుమంతుడి గద తీసుకుని భుజంపై పెట్టుకుని కూర్చుంది. అది చూసిన భక్తులు ఆ వానరానికి బొట్టు పెట్టి, దండ వేశారు. ఆ తర్వాత కూడా వానరం అలా... ఆంజనేయస్వామి విగ్రహం ముందే గద పట్టుకుని కూర్చుంది. ఇది తెలిసిన చాలా మంది హనుమంతుడే తమను దీవించడానికి ఇలా వచ్చాడంటూ ఆ ఆలయానికి పోటెత్తారట. ఇది ఎక్కడ జరిగిందో, ఎవరు మొదట వీడియో తీసి అప్ లోడ్ చేశారనే స్పష్టత లేదు. కానీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఈ వీడియో వైరల్ గా మారింది. చాలా అకౌంట్లలో ఈ వీడియోను అప్ లోడ్ చేస్తున్నారు. వేల కొద్దీ వ్యూస్ నమోదవుతున్నాయి.

### పౌర హక్కుల నేత
## న్యాయవాది శంకర్ ఆకస్మిక మృతి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్,**
**తెలంగాణ ముచ్చట్లు:**
నగరానికి చెందిన, ప్రముఖ సీనియర్ న్యాయవాది, పౌర హక్కుల సంఘం నేత చల్లా శంకర్ (70) శనివారం అర్ధరాత్రి సమయం దాటిన తర్వాత గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి 8 గంటలకు సమయంలో ఒంట్లో కాస్త నలతగా ఉందని మెడికల్ షాప్ కి వెళ్లి టాబ్లెట్ తెచ్చుకొని వేసుకున్నాడు. ఆరోగ్యపరంగా కాస్త ఇబ్బందిగా ఉండటం చేత ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. శంకర్ సిపిఐ ఎంఎల్ జనశక్తి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం ఇంటర్మీడియట్ డిగ్రీ విద్యాభ్యాసం ఖమ్మంలోని సాగింది. పాఠశాల విద్యార్థి దశలోనే సమాజంలో జరుగుతున్న అక్రమాలపై తీవ్రంగా స్పందించారు. ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసుకున్న అనంతరం ఆయన వరంగల్ లో లా పూర్తి చేశారు అనంతరం ఉస్మానియా హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. పిడిఎస్యు వ్యవస్థాపకుల లో ఒకరు. జిల్లాలో ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శిగా ఆయన పని చేశారు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన జైలు జీవితాన్ని అనుభవించారు. 1985లో ఖమ్మం కోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకొని ప్రముఖ సీనియర్ న్యాయవాది పోట్ల వేణు వద్ద జూనియర్గా ఐదు సంవత్సరాలు పాటు పనిచేశారు. న్యాయవాదిగా పని చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్



రాష్ట్ర పౌరహక్కుల సంఘం లో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహించారు. నక్సలైట్ ఉద్యమాలకు సంబంధించిన కేసులను ఆయన చేపట్టి వాదించారు. ఆదివాసి హక్కుల విషయంలోనూ. ఎన్కౌంటర్ల విషయంలోనూ దివంగత పౌరహక్కుల నేతలు కన్నాభిరామన్, బాలగోపాల్ తదితర ప్రముఖ నాయకులతో కలిసి పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా టాడా కేసును ఎదుర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి అనేక కేసులను ఎదుర్కొని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన శంకర్ మృతి చెందడం అత్యంత బాధాకరమని పలువురు ప్రముఖులు శంకర్ నివాసంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పేర్కొన్నారు. సాయంత్రం జరిగిన అంత్యక్రియలలో రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు



## విసిఐ 106 ఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్ గా కొత్తా ప్రమాణ స్వీకారం

- క్లబ్ అభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తా
- క్లబ్ నూతన గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు
- ఘనంగా సత్కరించిన విసిఐ క్లబ్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్,**
**తెలంగాణ ముచ్చట్లు:**




ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని తద్వారా సమాజ అభివృద్ధికి పాటుపడాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ మోటివేటర్, ప్రమాణ స్వీకార, సన్మాన సభ ముఖ్యఅతిథి గంపా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వాసవి గార్డెన్ లో ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వి 106 ఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా నూతన గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ మాజీ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాసరావు నూతన గవర్నర్ గా ప్రముఖ సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో కొత్తాను వాసవి క్లబ్ నిర్వాహకులు ప్రముఖ వ్యాపారులు మిత్రులు గజమాలతో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీత కొత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వాసవి క్లబ్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. సేవా కార్యక్రమాలపై దృష్టి సారించి శాశ్వత ప్రాజెక్టు లు ఎక్కువగా అమలు అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ కొత్తా వెంకటేశ్వరరావు సారధ్యంలో వాసవి క్లబ్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు పోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ గవర్నర్ కడవెండి శ్రీనివాసరావు, నాలా సతీష్, దోసపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు పసుమర్తి చందర్రావు, చిన్ని కృష్ణారావు, పసుమర్తి రామ్మోహన్రావు, 36 డివిజన్ కార్పొరేటర్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, పులిపాటి ప్రసాదు, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, గెల్లా కృష్ణవేణి, మా శెట్టి వరప్రసాద్, గుంటుపల్లి దివాకర్ గుప్తా, పసుమర్తి సాంబ శివరావు, కోడుమూరి జగన్నాథం, న్యాయవాదులు యాచవరపు గోవర్ధన్ రెడ్డి, దిలీప్ చౌదరి. దిరిశాల కృష్ణారావు. ఆళ్ల నిరోషా. చంద్ర లీలా మోహన్. శివ సుబ్రహ్మణ్యం. హెచ్చ హరిబాబు. ఆకుల సతీష్ ఆత్మకూరి వెంకట రామారావు, బచ్చు మురళీకృష్ణ, గార్లపాటి సంతోష్ కుమార్. తదితర ఆర్యవైశ్య ప్రముఖులు కార్యక్రమానికి విచ్చేసి అభినందనలు తెలియజేశారు




## రూ.295 కట్ చేశారని ఏడేళ్లపాటు బ్యాంక్ తో ఫైట్ చేసిన కస్టమర్

చెక్ డిడక్షన్ చార్జీ అంటూ తన ఖాతాలో నుంచి అనవసరంగా డబ్బు కట్ చేసిన బ్యాంక్ పై ఓ కస్టమర్ సుదీర్ఘంగా పోరాడారు.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడేళ్లు న్యాయ పోరాటం చేసి తన ఖాతాలో నుంచి తగ్గించిన రూ.295 తిరిగి పొందాడు. బ్యాంక్ కట్ చేసిన మొత్తం చిన్నదేనని వదిలేయకుండా ఓ వినియోగదారుగా తన హక్కులను కాపాడుకోవడానికి పోరాడానని నిశాంత్ చెప్పారు. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ జిల్లాలోని ఓ బ్యాంకులో చోటుచేసుకుందీ ఘటన. జబల్ పూర్ జిల్లా పనాగర్ కు చెందిన నిశాంత్ తామ్రకార్ 2017లో ఓ వాషింగ్ మెషిన్ కొనుగోలు చేశాడు. దీనికి అయిన మొత్తాన్ని ఈఎంఐ విధానం కింద చెల్లించాడు. మొదటి నెల ఈఎంఐ చెల్లించినపుడు బ్యాంకు అదనంగా తన ఖాతాలో నుంచి రూ.295 లు కట్ చేసింది. దీనిపై బ్యాంకును సంప్రదించగా.. చెక్ డిడక్షన్ ఛార్జీ అని బ్యాంకు సిబ్బంది వివరణ ఇచ్చారు. తన ఖాతాలో ఎప్పుడూ తగినంత నిల్వ ఉంటుందని, చెక్ బౌన్స్ అయ్యే ఛాన్సే లేదని నిశాంత్ వాదించాడు. తన డబ్బులు తనకు తిరిగివ్వాలని కోరగా బ్యాంకు సిబ్బంది నిరాకరించారు.బ్యాంక్ సిబ్బంది నిర్వాకంపై మండిపడ్డ నిశాంత్ ఈ విషయాన్ని వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకెళ్లాడు. రూ.3 వేలు సెక్యూరిటీ డిపాజిట్ కింద జమ చేసి ఫిర్యాదు చేశాడు. జబల్ పూర్ వినియోగదారుల కోర్టులో ఈ కేసు దాదాపు ఏడేళ్ల పాటు విచారణ జరిగింది. నవంబర్ 29న కోర్టు తుది తీర్పు వెలువరించింది. నిశాంత్ ఖాతాలో నుంచి కట్ చేసిన రూ.295 తిరిగివ్వాలని బ్యాంకును ఆదేశించింది. దీంతో పాటు రూ.4 వేలు పరిహారంగా చెల్లించాలని తీర్పు చెప్పింది.

## దేవాదుల కాలువలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**జనగాం,తెలంగాణ ముచ్చట్లు:**
జనగామ మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన దేవాదుల కాల్వల ద్వారా నీరు చేరడానికి సంబంధించి, గేట్ వాల్ లను పరిశీలించేందుకు ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఈఈ , డీఈ లతో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు బడికె కృష్ణస్వామి, మాజీ ఎంపీటీసీ మేరుగు బాలరాజ్, నరేందర్, కాంగ్రెస్



నాయకులు చామకూర చిరంజీవి, దాసరి శేఖర్, యాకూబ్, కేశవ్ రెడ్డి, పత్తి నరేందర్, నరసింహా, యూత్ కాంగ్రెస్ నాయకులు పృథ్వీరాజ్, ప్రకాష్ యాదవ్, రఘు, నిఖిల్ గౌడ్, అరవింద్, వెంకట్ రెడ్డి, రాజు, సంపత్, రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# “జ్ఞానము ద్వారానే విద్యార్థులు విజయతీరాలకు చేరుతారు”

- హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుబేదారి యందు మొదటి రోజు విద్యా దినోత్సవం సందర్భంగా పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు 150 మందికి పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి హాజరయ్యారు.

ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, జ్ఞానాన్ని ఆర్జించడం ద్వారా మాత్రమే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరగలుగుతారని, పఠనాన్ని నిరంతరం కొనసాగించి ఇలాంటి పోటీలలో పాల్గొనాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు మరియు పాఠశాలల మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఈ అవసరాలు పూరించబడుతున్నట్లు ఆయన చెప్పారు. మండల స్థాయిలో జరిగిన పోటీలకు విద్యార్థుల భారీ రాక ఆనందకరమని ఆయన చెప్పారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు మరియు సర్టిఫికెట్లు అందజేశారు.

**మొదటి బహుమతి:** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, హనుమకొండ - వి. వర్ష

**ద్వితీయ బహుమతి:** సుబేదారి ప్రభుత్వ పాఠశాల - జి. అంకిత

**తృతీయ బహుమతి:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వడ్డేపల్లి - జి. నందిని

**కన్సోలేషన్ బహుమతి:** ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల - విద్యార్థి

ఈ కార్యక్రమంలో హనుమకొండ మండల నోడల్ అధికారి మరియు సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు నెహ్రూ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి డి. వాసంతి, గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, ఉపాధ్యాయులు సురేష్ సిఆర్పి, ఉమాదేవి, షఫీ, మండల ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రేవూరిని కలిసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

**పరకాల,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలకు పరకాల నియోజకవర్గ పిసిసి కోఆర్డినేటర్ గా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ను నియమించారు. ఈ సందర్భంగా, వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ను వారి క్యాంపు కార్యాలయంలో రాయల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా, రాయల నాగేశ్వరరావు శాలువాతో రేవూరి ప్రకాశ్ రెడ్డి ను సత్కరించి, పూల మొక్కను బహూకరించారు.




## పూర్తిగా చదవాలి క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి

- డాక్టర్ కబీర్ సిద్ధికి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మెడికో ప్రపంచంలో నూతనంగా మొదటి సంవత్సరం ప్రవేశంతో వస్తున్న విద్యార్థిని విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల సబ్జెక్టు ఇతర వైద్య సంబంధిత ఆర్టికల్స్ ను పూర్తిగా చదవాలని వాటిని క్షుణంగా అర్థం చేసుకోవాలని డేర్ ( డాక్టర్ అసోసియేషన్ ఫర్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కబీర్ సిద్ధికి అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ( ఐఎంఏ ) హాలులో డాక్టర్ అసోసియేషన్ ఫర్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ మరియు ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికోస్ ఫర్ సర్వీస్ అండ్ అకాడమిక్స్ సంస్థల ఆధ్వర్యంలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నా విద్యార్థినీ విద్యార్థులకు ఎలా చదవాలి ఏదీ చదవాలి వాటిని ఎలా గుర్తు పెట్టుకోవాలి కేవలం పాఠ్య పుస్తకాలేనా ఇందులో దేనిని ప్రాముఖ్యతను ఇవ్వాలి అనే తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. కబీర్ సిద్ధికి తొలుత మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాల తో పాటు ఇతర వైద్య సంబంధిత పుస్తకాలను పూర్తిగా చదవాలని వాటిని క్షుణంగా అర్థం చేసుకోవాలని తద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రోజుకి ఎన్నిసార్లు చదవాలి ఎన్ని పుస్తకాలు చదవాలి అనేది విషయానికి సంబంధించి ఎలాంటి నీయమ నిబంధనలు లేవని మనం నిత్యం అప్డేట్ కావాలి అంటే నిత్యం విద్యార్థిలాగానే నేర్చుకుంటూ ఉండాలని సూచించారు. అనంతరం ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ వైద్య విద్యార్థిని విద్యార్థులకు ఇచ్చే ముఖ్యమైన సలహా ఏమిటంటే చదువుతోపాటు కొన్ని విషయాలను నేర్చుకోవాలి మరియు మనుషుల సైకాలజీ ని కూడా అర్థం చేసుకోవాలని కోరారు. డేర్ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ . నైమా సుల్తానా మాట్లాడుతూ మన విశ్వాసాలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఐహిక , దైవిక అంశాల సమన్వయంతో వైద్య విద్యను అభ్యాసించాలని పిలుపునిచ్చారు. సదస్సు అనంతరం నూతన వైద్య విద్యార్థినులకు విద్యార్థులకు ఘనంగా సన్మానించి , సంస్థ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికోస్ ఫర్ సర్వీస్ అండ్ అకాడమిక్స్ హైదరాబాదు అధ్యక్షులు డాక్టర్ మేరజుద్దిన్ డేర్ హైదరాబాదు సెక్రటరి డాక్టర్ ఉసామా డేర్ ఖమ్మం ఉపాధ్యక్షులు డాక్టర్ ముష్తాఖ్ అహ్మద్ , డాక్టర్ ఆరిఫ్, సెక్రటరిస్ డాక్టర్ షెక్ ఫయాజ్, డాక్టర్ గులాం షరీఫ్ , ట్రెజరర్ డాక్టర్ మన్సూర్ ఇలాహి , డాక్టర్ ముక్తార్ అహ్మద్ , మహిళా విభాగం సెక్రటరి డాక్టర్ ఆమిరా, షమా ఫీర్దౌస్ ,డాక్టర్ అరషితా , నహిదా సదఫ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






## న్యాయమూర్తులు,న్యాయవాదుల మధ్య సత్సంబంధాలతోనే బాధితులకు న్యాయం

- జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్
- హనుమకొండలో రెండవ రోజు ఐఏఎల్ రాష్ట్ర మహా సభలు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

కోర్టులలో న్యాయమూర్తులు,న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు మాత్రమే బాధితులకు సరైన న్యాయం అందించగలవని ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జరుగుతున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర మహాసభల రెండవ రోజు ‘న్యాయమూర్తులు, న్యాయవాదుల సంబంధాలు వృత్తిపరమైన నైతిక విలువలు’ అన్న అంశంపై జరిగిన సదస్సులో జస్టిస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. జస్టిస్ ప్రవీణ్ కుమార్ కోర్టుల్లో సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులకు మార్గదర్శకత్వం ఇవ్వాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాదనా పటిమను పెంపొందించాలని సూచించారు. “చైతన్యవంతమైన నిపుణత కలిగిన బార్ నుండే ఉత్తమమైన జడ్జీలు పుట్టుకొస్తారు” అని ఆయన చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ రమేష్ బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిర్మలా గీతాంబా తదితరులు కూడా ప్రసంగించారు. వారు కోర్టుల గౌరవాన్ని కాపాడే విధంగా న్యాయవాదులు తమ పని చేయాలని, న్యాయవ్యవస్థ విలువలను గౌరవించమని చెప్పారు.

**న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి**

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరుతూ, న్యాయవాదుల రక్షణ కోసం తక్షణమే ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, “న్యాయవాదుల ఆరోగ్య భీమా, రిటైర్డ్ న్యాయవాదులకు పెన్షన్, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సాయం చేయాలని” చెప్పారు. ఈ కార్యక్రమంలో ఝార్ఖండ్ బార్ కౌన్సిల్ సభ్యుడు రషీద్, ఇతర సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఐఏఎల్ నాయకులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి - - - ఆరోగ్య పెన్నిధి

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**సూరారం డివిజన్,తెలంగాణ ముచ్చట్లు:**

సూరారం డివిజన్ కు చెందిన పి. సత్యనారాయణ తండ్రి అప్పా రావు ఇటీవల కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుండి రెండు లక్షల రూపాయలను మంజూరు చేయించి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ, “నిరుపేదలకు ఆరోగ్య భద్రత ఇవ్వడం ఈ సహాయనిధి ప్రధాన ఉద్దేశ్యమని” తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం స్థానిక రామాలయం లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ ఇరుముడి కార్యక్రమం సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గత 40 రోజుల నుండి ఎంతో నిష్టతో, కఠినమైన నియమాలతో దీక్ష చేపట్టి ఇరుముడి కట్టుకున్న బానోత్ వీరన్న గురుస్వామి, జక్కంపూడి ఉపేందర్ గురు స్వామి బాదావత్ నాగరాజ్ స్వామి, భూక్య రవి స్వామి మరియు దాదాపు 40 మంది అయ్యప్ప స్వాముల శబరి యాత్ర ప్రశాంతంగా జరగాలని, కోరుకుంటున్నట్లుగా తెలిపారు. తమిళనాడులో కురుస్తున్న భారీ వర్షాలను జాగ్రత్తగా గమనించి, అందరూ ఎట్టి పరిస్థితులలో కూడా అందరూఒకే చోట ఉండేటట్లుగా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భానోత్ నరసింహ నాయక్, మేకల మల్లికార్జున రావు, గుంటుపల్లి వెంకట్రావు, శీలం పుల్లయ్య భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాదు, దిండిగల శబరి నాథ్, అల్లిక బక్కయ్య గుగులోత్ కిషన్, మొగిలి ముత్తిలింగం, తదితరులు పాల్గొన్నారు

# హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ , తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హల్ లో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్

ముఖ్య అతిథిగా పాల్గొని ఎయిడ్స్ అవగాహన పోస్టర్స్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు.

అంతకుముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి సాంబశివరావు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రధాన ద్వారామ్ నుండి ఐఎంఏ హాల్ వరంగల్ వరకు ర్యాలీని నిర్వహించడం జరిగినది. అనంతరం కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వరంగల్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎయిడ్స్ అసురక్షిత లైంగిక సంపర్కం ద్వారా, కలుషితమైన సూదులు సిరంజిల ద్వారా, కలుషితమైన రక్తాన్ని మరొక్కరికి ఎక్కించడం ద్వారా ,హెచ్ఐవి సోకిన తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు వచ్చునని అన్నారు. వివిధ వ్యాధుల ద్వారా మరణించే వారి గణాంకాల ప్రకారం కన్న ఎయిడ్స్ వ్యాధి వల్ల




మరణించే వారి సంఖ్య చాలా తక్కువని తెలిపారు . ప్రజలలో వైద్య ఆరోగ్యశాఖ, ఎన్జీవోలు కీలకమైన సేవలందిస్తున్నారని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఎయిడ్స్ పై చర్చించుకోని అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రజలలో చైతన్యం కలిగితే ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోనే అవసరమే ఉండదని ఆకాంక్షించారు. డాక్టర్ బి సాంబశివ రావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న ఎయిడ్స్ సేవలపై ప్రగతి నివేదిక వివరించారు. ఈ సంవత్సరం" కలెక్టివ్ యాక్షన్ సస్టేన్ మరియు ఎక్సెలరేట్ హెచ్ఐవి ప్రోగ్రెస్" నినాదమును తెలుపుతూ జిల్లాలో ఐసిటిసి కేంద్రాలు మూడు, తల్లి నుండి హెచ్ఐవి పిల్లలకు సోకకుండా చేసే కేంద్రము ఒకటి ,ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎయిడ్స్ పై అవగాహన నిర్ధారణ చేయబడునని తెలిపినారు. ఏఆర్టీ కేంద్రం, లింకు ఎఆర్టి కేంద్రాలు, సపోర్ట్ కేంద్రాలు ద్వారా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తున్నామని తెలిపినారు. రక్తనిధి కేంద్రాలు మూడు పనిచేస్తున్నాయని 2023 24 సంవత్సరముల లో 31, 688 వ్యక్తులకు హెచ్ఐవి రక్త పరీక్షలు చేయగా 493 మందికి హెచ్ఐవి ఉన్నట్లుగా నిర్ధారించడం జరిగినది ,13022మందికి గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవి రక్త పరీక్షలు చేయగా ఏడు మందికి హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారించామని, ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 2024 వరకు 19900 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించగా 262 మందికి హెచ్ఐవి ఉన్నట్టుగా నిర్ధారించడం జరిగినదని .గర్భిణీ స్త్రీలకు 11210 మందికి హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి హెచ్ఐవి ఉన్నట్లుగా నిర్ధారించడం అయినదని, జిల్లాలోని ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్ లలో డాక్టర్లకు హెచ్ఐవి టెస్టింగ్ మరియు హెచ్ఐవి ప్రాముఖ్యత గురించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. జిల్లా కలెక్టర్, మరియు జిల్లా న్యాయ సేవ సంస్థ సహకారముతో హెచ్ఐవి పాజిటివ్ కలిగిన వ్యక్తులకు 10 కిలోల బియ్యం ఇవ్వడం జరుగుచున్నది .కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులకు హెచ్ఐవి , టిబి ,బ్లడ్ డొనేషన్ పై అవగాహన నిర్వహించి వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానితులు ఎయిడ్స్ పై ప్రసంగించి, అందరూ ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరము ఎయిడ్స్ నిర్మూలన కార్యక్రమంలో ఉన్నతమైన సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమములో ఎంజీఎం సూపరెంటెంట్ డాక్టర్ కిషోర్, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ ,డాక్టర్ మోహన్, సింగ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ ,డాక్టర్ సూర్య ప్రకాష్ ,ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అన్వర్, డాక్టర్ విజయ చందర్ రెడ్డి, డాక్టర్ శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ఎయిడ్స్ జిల్లా కోఆర్డినేటర్ మాధురి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్ , ఎన్జీవోస్ సర్వోదయ శాంత రాజు, ఆర్డి ఎంఎం ఈశ్వర్, మేరీ విజయ, మైగ్రేడ్స్ గోవర్ధన్, డిఆర్పి ముస్తాక్, ట్రాక్టర్స్ నవ్య , వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎన్సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతదేహాన్ని తెప్పించేందుకు ఎంపీ విశేష కృషి..

- అమెరికా చికాగోలోని కాన్సులేట్ కార్యాలయం ద్వారా.. వేగిరం
- ఎన్ఆర్ఐ, తానా విభాగాలతో సంప్రదింపులు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

అమెరికాలో తుపాకీ తూటాలకు ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేటకు చెందిన నూకారపు కోటేశ్వరరావు కుమారుడైన నూకారపు సాయి తేజ.. అనే ఎంఎస్ విద్యార్థి దుర్మరణం చెందగా.. అతడి మృతదేహాన్ని మన దేశానికి త్వరగా రప్పించేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున దుండగుల కాల్పుల్లో మృతి చెందిన దుర్ఘటన తెలుసుకొని.. ఎంపీ సత్వరమే స్పందించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ సూచనతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. అమెరికాలోని భారత రాయబార కార్యాలయ ( ఇండియన్ హై కమిషన్ ) అధికారులతో సంప్రదించారు. వీలైనంత త్వరగా.. సాయి తేజ మృతదేహాన్ని భారత్ కు పంపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే.. ఎన్ఆర్ఐ విభాగం ద్వారా, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ద్వారా కూడా.. ఎంపీ రఘురాం రెడ్డి అమెరికాలో వేగంగా చర్యలు తీసుకునేలా చూస్తున్నారు. శనివారం, ఆదివారం అమెరికాలో వారాంతపు




సెలవులు ఉన్నప్పటికీ.. మానవీయ కోణంలో.. జాప్యం లేకుండా వీలైనంత త్వరగా సాయి తేజ మృతదేహాన్ని ఇక్కడికి రప్పించేలా.. రెండు రోజులుగా కృషి చేస్తున్నారు. మృతుడి తండ్రి.. నూకారపు కోటేశ్వరరావు తో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ద్వారా ఇప్పటికే ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎంపీ రఘురాం రెడ్డి అభయమిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
www.telanganamuchatlu.in

సోమవారం 02–12–2024





# ట్రోలర్స్‌కు రష్మిక స్ట్రాంగ్ రిప్లై!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతోంది. ఆమె హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ "పుష్ప 2: ది రూల్". 'పుష్ప: ది రైజ్' సీక్వెల్ గా రాబోతున్న ఈ సినిమాలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కు జోడీగా కనిపించనుంది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా డిసెంబర్ 5న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో రష్మిక దూకుడుగా ప్రమోషన్స్ లో పాల్గొంటోంది. ఇందులో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది.'పుష్ప' సెట్‌లో అడుగుపెట్టిన మొదటి రోజు అల్లు అర్జున్ ఎదురుగా నిల్చున్నా, పుష్పరాజ్ గెటప్ లో ఉండటంతో అసలు గుర్తుపట్టలేకపోయానని రష్మిక తెలిపింది. శ్రీవల్లి గెటప్‌లో మేకప్ లేకుండా ఉన్న తనను కూడా ఎవరూ గుర్తుపట్టేవారు కాదని చెప్పింది. కొందరైతే నేరుగా తన దగ్గరకే వచ్చి రష్మిక ఎక్కడ అని అడిగేవారట. ఇక తనకు డిసెంబర్ నెల అంటే చాలా సెంటిమెంట్ అని చెబుతోంది రష్మిక. హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన 'కిరాక్ పార్టీ' సినిమా.. 'అంజనీపుత్ర', 'చమక్' సినిమాలు డిసెంబర్‌లోనే వచ్చి విజయం సాధించాయి. నేషనల్ వైడ్ గా పాపులారిటీ తెచ్చిపెట్టిన 'పుష్ప: ది రైజ్', 'యానిమల్' చిత్రాలు సైతం ఇదే నెలలో వచ్చాయని.. ఇప్పుడు 'పుష్ప 2' కూడా హిట్ అవుతుందని నమ్ముతోంది.

'యానిమల్' మూవీలో హీరో రణ్‌బీర్ కపూర్ ను కొట్టే సీన్ తనకి ఛాలెంజింగ్ గా అనిపించిందని రష్మిక తెలిపింది. ఆ సీన్ లో ఎమోషన్స్ స్ట్రాంగ్ గా పండాలని, చాలా నేచురల్ గా ఉండాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చెప్పారట. యాక్షన్ అని అనగానే రణ్ బీర్ మీద కేకలు వేస్తూ, అతడి చెంప మీద చెళ్లుమనిపించిందట. షాట్ ఓకే అని డైరెక్టర్ చెప్పినా కన్నీళ్లు మాత్రం ఆగలేదని.. బాగా ఏడ్చేశానని రష్మిక చెప్పింది. దాదాపు 8 నిమిషాల ఆ సన్నివేశాన్ని సింగిల్ టేక్‌లో పూర్తి చేసినట్లుగా తెలిపింది.చిన్నతనంలో తన ఫ్యామిలీ పేదరికం అనుభవించినట్లుగా రష్మిక మందన్న చెబుతోంది. నాన్న చేసిన బిజినెస్ దెబ్బతినడంతో ఒక్కసారిగా నష్టాల్లో కూరుకుపోయాం. కొన్నేళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆ టైంలో ఇంటిని నడపడానికి నాన్న చాలా కష్టపడ్డారు. ఇంటి అద్దె కూడా కట్టలేని పొజిషన్ కి వచ్చేశాం




# జైలర్ -2 లో ఆ స్టార్లు అంతా భాగమేనా?

సూపర్ స్టార్ రజనీ కాంత్-నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ లో రిలీజ్ అయిన 'జైలర్' ఎంతపెద్ద విజయం సాధించిందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద 650 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. చాలా కాలం తర్వాత రజనీకి పర్ఫెక్ట్ బ్లాక్ బస్టర్ పడింది. ఈ సినిమా సక్సెస్ లో రజనీ ఒక్కరే కీలకం కాదు. భారీ కాన్వాస్ పై తెరకెక్కిన చిత్రమిది. మోహన్ లాల్, శివరాజ్ కుమార్, జాకీ ష్రాఫ్ లాంటి టాప్ స్టార్లు గెస్ట్ అప్పిరియన్స్ ఇవ్వడంతోనే ఇది సాధ్యమైంది.ఇందులో ఒక్కొక్కరి ఎంట్రీనే థియేటర్లో విజిల్స్ వేయించింది. ఆ రేంజ్ లో పాత్రలు కనెక్ట్ అయ్యాయి. తాజాగా ఈసినిమా సీక్వెల్ కూడా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'కూలీ' షూటింగ్ అనంతరం రజనీకాంత్ 'జైలర్-2' చిత్రం షూటింగ్ లో పాల్గొంటారు. అయితే సీక్వెల్ లో 'జైలర్' టీమ్ అంతా యధావిధిగా కొనసాగుతుందా? లేదా? అన్న సందేహం ఉంది. హీరోయిన్ సహా కొన్ని పాత్రల విషయంలో మార్పులుంటాయి. గెస్ట్ పాత్రల్ని కూడా మారే అవకాశం ఉంటుంది.కొత్త నటీనటుల్ని తీసుకుంటే? సినిమాకి ఫ్రెష్ ఫీల్ వస్తుందనే కోణంలో ఈ రకమైన మార్పులు జరుగుతుంటాయి. అయితే మిగతా నటీనటుల సంగతి పక్కనబెడితే సీక్వెల్ లో మాత్రం మోహన్ లాల్, శివన్న, జాకీ ష్రాఫ్ యధావిధిగా గెస్ట్ రోల్స్ లో కంటిన్యూ అవుతారని సమాచారం. ఆ పాత్రలతో పాటు కొత్తగా మరో ఇద్దరు స్టార్లను జోడిస్తారని కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. విలన్ పాత్ర పోషించిన వినాయకన్ రోల్ మాత్రం అలాగే ఉంటుందిట. ఆ రోల్ ని సీక్వెల్ లో మరింత శక్తివంతంగా మలుస్తున్నారుట. ఆ పాత్రలో యధావిధిగా కామెడీ యాంగిల్ ని హైలైట్ చేస్తునే అవసరం మేర అంతే సీరియస్ నెస్ గాను స్క్రిప్ట్ లో మలిచినట్లు వినిపిస్తుంది. 'జైలర్' లో రజనీకాంత్ భార్య పాత్రలో రమ్యకృష్ణ నటించారు. ఆ పాత్రని మాత్రం రీప్లేస్ చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి.

# sports స్పోర్ట్స్ sports




## మళ్లీ డ్రానే

ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో గేమ్ డ్రాగా ముగిసింది. శనివారం అయిదో రౌండ్లో భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్ (Gukesh), డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) 40 ఎత్తుల తర్వాత పాయింట్ పంచుకున్నారు. ఈ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన 18 ఏళ్ల గుకేశ్.. కింగ్స్ పాన్ ఓపెనింగ్‌తో మొదలెట్టి, ఫ్రెంచ్ డిఫెన్స్ ఎదుర్కొన్నాడు. కానీ ఆరంభ ఎత్తుల తర్వాత రక్షణాత్మక ధోరణి ప్రదర్శించాడు. ఎందుకంటే ఈ పోరు తొలి గేమ్‌లో ఇలాంటి ఆరంభ ఎత్తుల తర్వాత తడబడ్డ గుకేశ్ ఓటమి పాలయ్యాడు. అందుకే ఈ సారి ఆ తప్పిదం చేయకుండా జాగ్రత్తగా పావులు కదిపాడు. మరోవైపు ఈ టైటిల్ సమరంలో 32 ఏళ్ల లిరెన్ తొలిసారి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడాడు. గుకేశ్‌ను సమస్యల్లోకి నెట్టి విజయం సాధించాలనుకున్నాడు. కానీ మధ్యలో రూక్ విషయంలో ఓ పొరపాటు చేసినప్పటికీ మళ్లీ పుంజుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ ప్రత్యర్థికి ఆ అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ పావులను త్యాగం చేస్తూ సాగడంతో పోరు డ్రాగా ముగుస్తుందని ముందే స్పష్టమైంది. కానీ నిబంధనల ప్రకారం డ్రా అయ్యే పక్షంలో కనీసం 40 ఎత్తులు వేయాలి. దీంతో అవి పూర్తవగానే ఇద్దరు ఆటగాళ్లు కరచాలనం చేశారు. ఈ పోరులో అయిదు గేమ్‌లు పూర్తయ్యే సరికి గుకేశ్, లిరెన్ 2.5-2.5తో సమానంగా ఉన్నారు. ఈ పోటీలో మరో 9 రౌండ్లు మిగిలి ఉన్నాయి. మొదట 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు. ఆదివారం ఆరో గేమ్‌లో గుకేశ్ నల్లపావులతో ఆడబోతున్నాడు. చెస్ కాకుండా ఇతర ఆటల్లో భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని, టెన్నిస్ అగ్రశ్రేణి ఆటగాడు జకోవిచ్‌ను అభిమానిస్తానని గుకేశ్ చెప్పాడు. "చిన్నప్పుడు నేను ధోనిని ఆరాధించేవాణ్ని. ఇప్పుడు జకోవిచ్‌ను అభిమానిస్తున్నా. ఈ ఇద్దరూ గొప్ప అథ్లెట్లు. చాలా విషయాల్లో వీరిని ఆరాధిస్తా. ఈ పోటీల్లో ఒక్కో గేమ్‌పై దృష్టి పెడుతూ సాగుతున్నా. ఈ పోరులో ఇంకా సగం రౌండ్లు కూడా పూర్తి కాలేదు. ముఖ్యమైన గేమ్‌లు రాబోతున్నాయి. తొలి గేమ్‌లో ఓడిపోయిన తర్వాత కూడా ఇప్పుడీ స్థితిలో ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఈ గేమ్ ఎలాగో డ్రా అవుతుందని తెలుసు. కానీ మధ్యలో ఆ పొరపాటు ఎలా జరిగిందో అర్థం కాలేదు. ఆ తర్వాత పుంజుకున్నా. గేమ్ మధ్యలో కళ్లు మూసుకోవడం అలవాటు. ఆ సమయంలోనే ఎత్తుల గురించి లెక్కలేసుకోవడం సులువుగా ఉంటుంది" అని చెన్నైకి చెందిన గుకేశ్ తెలిపాడు.




ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మరో ఘనత అందుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు (1630) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ ) (1625 పరుగులు) పేరిట ఉండేది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో రూట్ 23 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. సచిన్ 60 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత అందుకోగా.. జో రూట్ కేవలం 49 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు 150 టెస్టులు ఆడిన అతడు.. 12,777 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నాడు.న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం 155/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కివీస్.. 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84; 167 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 12.4 ఓవర్లలోనే ఛేదించింది. జాకబ్ బెథెల్ (50*; 37 బంతుల్లో), బెన్ డకెట్ (27; 18 బంతుల్లో), జో రూట్ (23*; 15 బంతుల్లో) పరుగులు చేశారు.




## టెస్టు క్రికెట్.. సచిన్ రికార్డును బ్రేక్ చేసిన జో రూట్

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in